
సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ నాయకత్వంలో పారిశ్రామికాభివృద్ధి, ఉద్యోగ కల్పనలో అధికారిక రికార్డులే విజయాలకు నిదర్శనం. వైసీపీ ఐదేళ్ల పాలనలో తీసుకొచ్చిన పరిశ్రమలు, ఆకర్షించిన పెట్టుబడులు, కల్పించిన ప్రైవేట్ ఉద్యోగాలపై ఇప్పటికీ సమాధానం లేదు.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



సోమవారం 14.09.2026

INK OF TRUTH


# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 145 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# ప్రపంచ సవాళ్లకు.. బ్రిక్స్ సంసిద్ధం!

BRICS



## ఉద్రిక్తతలు, విపత్తులను సమష్టిగా ఎదుర్కొందాం: మోదీ

## ముందస్తు హెచ్చరిక వ్యవస్థపై సభ్య దేశాల ఏకాభిప్రాయం

## బహుళ ధ్రువ ప్రపంచానికి గ్లోబల్ సౌత్ చోదక శక్తి: జిన్‌పింగ్

## ఆర్థిక భద్రతకు కొత్త బీమా వ్యవస్థ: పుతిన్


● వివరాలు 2 లో


**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్):** ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో బ్రిక్స్ దేశాలు మరింత దృఢంగా, సంసిద్ధంగా ఉండాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. పరస్పరం అనుసంధానమైన ప్రస్తుత ప్రపంచంలో ఏ సంక్షోభమూ ఒకే ప్రాంతానికి పరిమితం కాదని పేర్కొన్నారు. న్యూఢిల్లీలో జరుగుతున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు రెండో రోజు 'స్థితిస్థాపకత, ఆవిష్కరణలు, సహకారం, సుస్థిరత: సమ్మిళిత ప్రపంచ వృద్ధి కోసం భవిష్యత్తును తీర్చిదిద్దడం' అంశంపై జరిగిన బహిరంగ సమావేశంలో ఆయన ప్రసంగించారు.

ప్రపంచంలో ఉద్రిక్తతలు నిరంతరం పెరుగుతున్నాయని, వాటి ప్రభావం సామాన్య ప్రజల జీవితాలపై విస్తృతంగా పడుతోందని మోదీ అన్నారు. మహమ్మారులు, వాతావరణ విపత్తులు, సరఫరా గొలుసుల అంతరాయాలు ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో క్లిష్ట పరిస్థితులను తట్టుకుని తిరిగి బలంగా నిలబడే సామర్థ్యాన్ని బ్రిక్స్ దేశాలు పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సవాళ్లను సకాలంలో గుర్తించడం, ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండటం, తక్షణ చర్యలు చేపట్టడం కీలకమని చెప్పారు.

**ముందస్తు హెచ్చరిక వ్యవస్థ :** అంటువ్యాధుల నివారణ, వాటిపై స్పందించేందుకు ఉద్దేశించిన 'బ్రిక్స్ సమగ్ర ముందస్తు హెచ్చరిక వ్యవస్థ'పై ఏకాభిప్రాయం కుదిరిందని మోదీ తెలిపారు. విపత్తుల నిర్వహణ కోసం 'ముందస్తు హెచ్చరిక డేటా అనుసంధాన మార్గదర్శకాలు' రూపొందించినట్లు వెల్లడించారు. కీలక ఖనిజాల ఆయుధీకరణ ఉమ్మడి వృద్ధికి అడ్డంకులు సృష్టించగలదని హెచ్చరించారు.

భారత్ బ్రిక్స్ చైర్‌గా స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత అనే నాలుగు మూలస్తంభాలపై దృష్టి సారించిందని మోదీ చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా బ్రిక్స్‌పై, గ్లోబల్ సౌత్ దేశాలపై విశ్వాసం పెరుగుతోందన్నారు.

**ఢిల్లీ డిక్లరేషన్‌కు స్పష్టమైన దిశ:** రెండు రోజులపాటు భారత్ ఆతిథ్యమిచ్చిన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ సదస్సులో చురుగ్గా పాల్గొని విలువైన సూచనలు అందించిన నేతలకు, సహకరించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆమోదించిన న్యూఢిల్లీ డిక్లరేషన్ ఉమ్మడి దార్శనికత, భవిష్యత్ సహకారానికి స్పష్టమైన దిశానిర్దేశం చేస్తుందని అన్నారు.

## గ్లోబల్ సౌత్ ఎదుగుదలే.. ప్రపంచానికి దిక్సూచి!



- అంతర్జాతీయ వ్యవహారాల్లో బ్రిక్స్ స్థిరీకరణ పాత్ర పోషించాలి
- అంతర్గత వ్యవహారాల్లో జోక్యం వద్దు: జిన్‌పింగ్
- ఆవిష్కరణలు, వర్ధమాన పరిశ్రమలపై ప్రత్యేక దృష్టి


2 లో


# అంటువ్యాధులపై అప్రమత్తం

- వర్షాలతో వ్యాధుల ముప్పు పెరగకుండా ప్రత్యేక చర్యలు
- మలేరియా, డెంగ్యూపై క్షేత్రస్థాయిలో నిఘా
- కేసులు పెరిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించాలి: సత్యకుమార్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** వర్షాల నేపథ్యంలో అంటువ్యాధుల వ్యాప్తికి అవకాశం లేకుండా రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. రాష్ట్రంలో మలేరియా, డెంగ్యూ, స్క్రబ్ టైఫస్, టైఫాయిడ్, నీరు–ఆహారం ద్వారా వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పరిస్థితిపై రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు కేసులు పెరుగుతున్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి తక్షణ నివారణ చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా మలేరియా ప్రభావిత గిరిజన ప్రాంతాల్లో మందు పిచికారీ, దోమతెరల పంపిణీ, దోమల పిల్లల నిర్మూలనను ముమ్మరం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. డెంగ్యూ కేసులు నమోదైన ప్రాంతాల్లో వెంటనే దోమల నియంత్రణ చర్యలు చేపట్టడంతో పాటు, వర్షాల కారణంగా నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి దోమల పెరుగుదలకు అడ్డుకట్ట వేయాలని సూచించారు.

ప్రతి శుక్రవారం డ్రైడే (ఇళ్లలో, పరిసరాల్లో నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి నీటిని తొలగించే కార్యక్రమం)ను సమర్థంగా నిర్వహించాలని, ప్రజల భాగస్వామ్యంతో దోమల పెరుగుదల ప్రాంతాలను తొలగించాలని మంత్రి పేర్కొన్నారు. జిల్లాల నుంచి వచ్చే వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, పరిస్థితి తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో వెంటనే చర్యలు చేపట్టాలని, సంబంధిత శాఖల సమన్వయంతో పారిశుద్ధ్య, దోమల నియంత్రణ కార్యక్రమాలను పటిష్ఠంగా అమలు చేయాలని ఆదేశించారు. కేసుల రిపోర్టింగ్ వ్యవస్థను పటిష్ఠం చేయడం ద్వారా ముందస్తు జాగ్రత్తలు ఇతర చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ విషయమై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. కేసులు కేసులు నమోదు పరిమితికి మించి పెరుగుతున్నప్పుడు వెంటనే అలర్టులు అన్ని స్థాయిలోని వారికి వచ్చేలా వ్యవస్థను రూపొందించుకోవాలని స్పష్టం చేశారు.

**మలేరియాపై ప్రత్యేక దృష్టి :** ఆగస్టు 30 నాటికి రాష్ట్రంలో 7,895 మలేరియా కేసులు నమోదయ్యాయి. గత ఏడాది ఇదే సమయానికి 6,172 కేసులు నమోదయ్యాయి. దీంతో ఈ ఏడాది కేసులు 27.9 శాతం పెరిగాయి.

అయితే అల్లూరి సీతారామరాజు, పోలవరం, విజయనగరం ప్రాంతాల్లో మలేరియా కేసులు కాస్త పెరిగాయి. ఈ ప్రాంతాల్లో దోమల నివారణ, దోమల పిల్లలను తొలగించడం, జ్వరాలతో బాధపడుతున్న వారిని గుర్తించి పరీక్షలు చేయడం వంటి చర్యలను పెంచుతున్నారు.

ఇళ్లలో మందు పిచికారీ చేయడంతో పాటు అవసరమైన చోట దోమతెరలను పంపిణీ చేస్తున్నారు. చేరుకోవడం కష్టంగా ఉన్న గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక పరికరాల సహాయంతో దోమల పిల్లలను తొలగిస్తున్నారు. మిగతా 2లో...

# ఆసియా కప్.. హ్యాట్రిక్!

- చైనాపై 1-0తో గెలుపు.. జూనియర్ మహిళల హాకీ టైటిల్ భారత్ కైవసం
- 17వ నిమిషంలో సనికా చంద్రకాంత్ గోల్
- ఎఫ్ఐహెచ్ జూనియర్ ప్రపంచకప్‌కు అర్హత



**చైనా:** ఆసియా కప్ జూనియర్ మహిళల హాకీలో భారత్ మరోసారి సత్తా చాటింది. చైనా వేదికగా జరిగిన ఫైనల్లో ఆతిథ్య జట్టుపై 1–0తో విజయం సాధించి వరుసగా మూడోసారి ఆసియా ఛాంపియన్‌గా నిలిచింది. భారత జట్టు తరఫున సనికా చంద్రకాంత్ 17వ నిమిషంలో చేసిన ఏకైక గోల్ విజయాన్ని అందించింది. చివరి వరకు ఆ ఆధిక్యాన్ని కాపాడుకున్న యువ భారత్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఈ విజయంతో ఎఫ్ఐహెచ్ జూనియర్ ప్రపంచకప్ టోర్నీకి అర్హత సాధించింది.

భారత్, చైనా జట్ల మధ్య ఫైనల్ పోరు హోరాహోరీగా సాగింది. ఇరు జట్ల రక్షణ శ్రేణులు అద్భుతంగా అడ్డుకోవడంతో తొలి క్వార్టర్‌లో ఒక్క గోల్ కూడా నమోదు కాలేదు. రెండో క్వార్టర్ ఆరంభంలో భారత్ ఖాతా తెరిచింది. 17వ నిమిషంలో సనికా చంద్రకాంత్ గోల్ చేయడంతో భారత్ 1–0 ఆధిక్యంలోకి వెళ్లింది. మిగతా 2లో...

# పిడుగుపాటుకు నలుగురి మృతి



- నరసరావుపేట పరిధిలో విషాదం ● ఉరుములు.. మెరుపులతో భారీ వర్షం ● నాలుగు కుటుంబాల్లో తీరని విషాదం
- బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది: సీఎం చంద్రబాబు

**నరసరావుపేట(జర్నలిస్ట్ ఫైల్) :** పల్నాడు జిల్లా నరసరావుపేట పరిధిలో ఆదివారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం తీవ్ర విషాదాన్ని నింపింది. పలు గ్రామాల్లో పిడుగుపాటుకు గురై నలుగురు ప్రాణాలు కోల్పోయారు. పెట్లూరివారి పాలెంలో తల్లపునేని నాగమ్మ (63) ఇంటి సమీపంలోని కొబ్బరి చెట్టుపై పిడుగు పడగా.. మిగతా 2లో...

# ఎల్-నినోను ఎదుర్కొందాం

- తేమ ఒత్తిడిలోని ప్రతి పంటను కాపాడాలి: అచ్చెన్నాయుడు
- 2.44 లక్షల హెక్టార్లలో పంటలపై ప్రభావం
- 284 మండలాల్లో నిరంతర పర్యవేక్షణ
- అందుబాటులోని ప్రతి నీటి వనరుతో రక్షక తడులు
- ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సాహం



**అమరావతి, సెప్టెంబర్ 13(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో ఎల్–నినో ప్రభావంతో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొని, తేమ ఒత్తిడికి గురవుతున్న పంటలను కాపాడేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎల్–నినో పరిస్థితులు, వర్షపాతం, ఖరీఫ్ సాగు, పంటలపై ప్రభావం, పంట ఆరోగ్య పరిస్థితి, ప్రత్యామ్నాయ పంటల సాగు, అందుబాటులో ఉన్న నీటి వనరులతో పంటలను కాపాడేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఆదివారం మంత్రి అచ్చెన్నాయుడు అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల్లో రైతులు నష్టపోకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని స్పష్టం చేశారు. తేమ ఒత్తిడికి గురైన ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న ప్రతి నీటి వనరునూ సద్వినియోగం చేసుకుని పంటలను కాపాడేందుకు రక్షక తడులు అందించాలని వ్యవసాయ, జలవనరుల శాఖల అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, అవసరమైన చోట తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. - 2లో...


# 2029 నాటికి 21 రాష్ట్రాల్లో యుసిసి



- బీజేపీ-ఎన్‌డీఏ పాలిత రాష్ట్రాల్లో అమలు చేస్తాం: అమిత్‌షా
- ట్రిపుల్ తలాక్ రద్దు చేశాం.. నేర న్యాయ వ్యవస్థను బలోపేతం చేశాం
- ఆర్టికల్ 370, 35ఎ రద్దు రక్తపాతం లేకుండా పూర్తి
- నక్సలిజానికి తెర.. ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ విధానం

**న్యూఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్):** బీజేపీ, ఎన్‌డీఏ పాలనలో ఉన్న అన్ని రాష్ట్రాల్లో 2029 నాటికి ఏకరూప పౌరస్మృతి (యూనిఫామ్ సివిల్ కోడ్–యుసిసి)ని అమలు చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించారు. ప్రస్తుతం ఎన్‌డీఏ పాలనలో ఉన్న 21 రాష్ట్రాల్లో యుసిసిని ప్రవేశపెడతామని ఆయన తెలిపారు. ముంబైలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అమిత్‌షా మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ కూడా ఎన్‌డీఏ పాలనలోని రాష్ట్రాల జాబితాలో ఉంది. మిగతా 2లో...

# ఏఐ వేగానికి.. కళ్లెం వేయాలి



- భద్రతా చర్యలకు కంపెనీలకు మరింత సమయం అవసరం
- ఆంథ్రోపిక్ సీఈఓ డారియో అమోడెయ్ హెచ్చరిక
- ఆల్ట్‌మన్, ఎలాన్‌మస్క్ మద్దతు

**న్యూఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్):** కృత్రిమ మేధ (ఏఐ) అభివృద్ధి శరవేగంగా సాగుతున్న తీరు ఆందోళన కలిగిస్తోందని టెక్ దిగ్గజాలు హెచ్చరిస్తున్నారు. ఏఐ సామర్థ్యాల పెంపు వేగాన్ని కొంత తగ్గించి.. భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన సమయం వచ్చిందని ఆంథ్రోపిక్ సీఈఓ డారియో అమోడెయ్ అభిప్రాయపడ్డారు. ఏఐ మోడళ్ల భద్రతను మెరుగుపరిచేందుకు కంపెనీలకు మరింత సమయం ఇవ్వాలని సూచించారు. ఆయన అభిప్రాయానికి ఓపెన్‌ఏఐ సీఈఓ సామ్ ఆల్ట్‌మన్, ఎక్స్‌ఏఐ అధిపతి ఎలాన్ మస్క్ మద్దతు పలికారు.

**స్వయంగా మెరుగుపరుచుకునే ఏఐ :** సూపర్ ఇంటెలిజెన్స్ వ్యవస్థలను రూపొందించే క్రమంలో ఏఐ వ్యవస్థలు తమ సామర్థ్యాలను తామే మెరుగుపరుచుకునే స్థాయికి చేరుతున్నాయని డారియో ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐ ఏజెంట్లు బాహ్య వ్యవస్థలను యాక్సెస్ చేసేందుకు ప్రయత్నిస్తున్న ఘటనలను ఆయన ప్రస్తావించారు. ఇదే వేగంతో అభివృద్ధిని కొనసాగిస్తే త్వరలోనే స్వయంప్రతిపత్తి కలిగిన వ్యవస్థలు ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మిగతా 2లో...

# గ్లోబల్ సౌత్ ఎదుగుదలే.. ప్రపంచానికి దిక్సూచి!



**న్యూఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్):** ప్రపంచం ఎన్నడూ చూడని లోతైన మార్పులకు లోనవుతోందని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ అన్నారు. ఈ నేపథ్యంలో గ్లోబల్ సౌత్ దేశాలు సమిష్టిగా ఎదుగుతూ బహుధ్రువ ప్రపంచానికి కీలక చోదక శక్తిగా మారుతున్నాయని పేర్కొన్నారు. న్యూఢిల్లీలో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో ఆయన ప్రసంగించారు.

అంతర్జాతీయ పరిస్థితులు సంక్లిష్టంగా, అస్థిరంగా మారుతున్న నేపథ్యంలో బ్రిక్స్ దేశాలు గ్లోబల్ సౌత్ దేశాలతో కలిసి అంతర్జాతీయ వ్యవహారాల్లో సానుకూల, స్థిరీకరణ పాత్ర పోషించాలని జిన్‌పింగ్ సూచించారు. సార్వభౌమ సమానత్వం, అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోకపోవడం, వివాదాలను శాంతియుతంగా పరిష్కరించడం వంటి అంతర్జాతీయ నిబంధనలను పరిరక్షించాలని పిలుపునిచ్చారు.

**ఆచరణాత్మక సహకారం బలోపేతం :** బ్రిక్స్ దేశాలు ఆచరణాత్మక సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని జిన్‌పింగ్ సూచించారు. పారిశ్రామిక, సరఫరా గొలుసుల స్థిరత్వాన్ని కొనసాగిస్తూ ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. సాంప్రదాయ పరిశ్రమలతోపాటు వర్ధమాన పరిశ్రమల అభివృద్ధిపై దృష్టి సారించాలని పేర్కొన్నారు.

బ్రిక్స్ సహకారాన్ని మరింత విస్తరించేందుకు ఐదు కార్యక్రమాలను జిన్‌పింగ్ ప్రతిపాదించారు. మారుతున్న ప్రపంచ పరిస్థితుల్లో సభ్య దేశాల మధ్య సమన్వయం, సహకారాన్ని పెంచడం ద్వారా ఉమ్మడి అభివృద్ధికి బాటలు వేయాలని ఆయన ఆకాంక్షించారు.

# ఆసియా కప్.. హ్యాట్రిక్!

(మొదటి పేజీ తరువాయి)

ఆ తర్వాత చైనా గోల్ కోసం తీవ్రంగా ప్రయత్నించినా భారత రక్షణ శ్రేణి సమర్థంగా అడ్డుకుంది. మూడో, నాలుగో క్వార్టర్లలోనూ ఆతిథ్య జట్టుకు అవకాశం ఇవ్వకుండా ఆధిక్యాన్ని కాపాడుకుంది. దీంతో భారత్ 1–0తో విజయం సాధించింది.

**ఫైనల్‌కు ముందు.. :** క్వార్టర్‌ఫైనల్లో భారత్ పాకిస్థాన్‌పై ఏకంగా 19–0 తేడాతో ఘన విజయం సాధించింది. సెమీఫైనల్లో దక్షిణ కొరియాను 5–1తో చిత్తు చేసింది. ఆ మ్యాచ్‌లో సుప్రియ హ్యాట్రిక్ గోల్స్‌తో భారత్ విజయంలో కీలక పాత్ర పోషించింది.

**వరుసగా మూడోసారి :** జూనియర్ ఆసియా కప్ టైటిల్‌ను భారత్ వరుసగా మూడోసారి గెలుచుకోవడం విశేషం. గత కొన్నేళ్లుగా జూనియర్ మహిళల హాకీలో భారత జట్టు ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. 2023లో ఫైనల్లో దక్షిణ కొరియాను 2–1తో ఓడించి ఏహెచ్‌ఎఫ్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను సొంతం చేసుకున్న భారత్.. ఆ తర్వాత కూడా విజయాల పరంపర కొనసాగించింది. తాజాగా ఆసియా కప్‌లో హ్యాట్రిక్ సాధించింది.

**ఆటగాళ్లకు రూ.3 లక్షలు :** ఆసియా కప్ విజేతగా నిలిచిన భారత జూనియర్ మహిళల జట్టుకు హాకీ ఇండియా భారీ నజరానా ప్రకటించింది. ఒక్కో క్రీడాకారిణికి రూ. 3 లక్షలు, సహాయక సిబ్బందిలో ఒక్కొక్కరికి రూ. 1.5 లక్షలు అందించనున్నట్లు వెల్లడించింది.

**ప్రశంసల వెల్లువ :** చాంపియన్‌గా నిలిచిన భారత జూనియర్ మహిళల జట్టుపై పలువురు ప్రముఖులు ప్రశంసలు కురిపించారు. కేంద్ర మాజీమంత్రి స్మృతి ఇరానీ సోషల్ మీడియా వేదికగా జట్టును అభినందించారు. వరుసగా మూడోసారి జూనియర్ ఆసియా కప్ టైటిల్ గెలవడం అద్భుత విజయమని పేర్కొంటూ క్రీడాకారిణులు, కోచ్‌లు, సహాయక సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.

# పిడుగుపాటుకు నలుగురి మృతి

(మొదటి పేజీ తరువాయి)

ఆ శబ్దానికి ఆమె గుండె ఆగి మృతి చెందింది. అలాగే లక్ష్మీపురంలో ఇంటి పక్కనే పెద్ద శబ్దంతో పిడుగు పడటంతో మేకల వెంకాయమ్మ (60) గుండెపోటుతో చనిపోయింది. మరోవైపు పాలపాడు గ్రామానికి చెందిన రైతు దేరంగుల వెంకటయ్య, యక్కలవారిపాలేనికి చెందిన రైతు మజ్జిగ చిన్న కోటేశ్వరరావు పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మరణించారు. ఇదే సమయంలో మరో రెండు గ్రామాల్లో పడిన పిడుగుల ధాటికి మూడు ఆటోలతో పాటు కొబ్బరి, మామిడి చెట్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి.

**బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది: సీఎం చంద్రబాబు నాయుడు**

నరసరావుపేట మండలంలో పిడుగుపాటుకు నలుగురు మృతి చెందడంపై సీఎం చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పెట్లూరివారిపాలెం, మోపిరివారిపాలెం, కాకాని శివారు లక్ష్మీపురం, పాలపాడు గ్రామాలకు చెందిన తలపనేని నాగమ్మ, మజ్జిగ చిన్న కోటేశ్వరరావు, మేకల వెంకాయమ్మ, దేరంగుల వెంకటయ్య పిడుగుపాటుకు మృతి చెందడం బాధాకరమన్నారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించిన సీఎం చంద్రబాబు.. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. పండుగ వేళ నాలుగు కుటుంబాల్లో విషాదం నెలకొనడం తీవ్రంగా కలచివేసిందన్నారు. ఈ విషాద సమయంలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని చంద్రబాబు భరోసా ఇచ్చారు.

**బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు**

ఒకేరోజు నరసరావుపేట పరిధిలో పిడుగుపాటుకు గురై నలుగురు మృతి చెందడంపై స్థానిక ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు తీవ్ర దిగ్భ్రాంతి, విచారాన్ని వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న వెంటనే ఆయన మృతుల గ్రామాలు సందర్శించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వం తరఫున బాధిత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వ నష్టపరిహారం త్వరితగతిన అందేలా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు.

# ఏఐ వేగానికి.. కళ్లెం వేయాలి

(మొదటి పేజీ తరువాయి)

మరో 6–12 నెలల్లోనే ఇలాంటి వ్యవస్థలు మొత్తం ఇంటర్నెట్‌పై ఆధిపత్యం సాధించే ప్రమాదం ఉందని డారియో పేర్కొన్నారు. అదే జరిగితే కొన్ని వందల బిలియన్ డాలర్ల మేర నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు.

**పురోగతిని ఆపాలని కాదు.. :** సాంకేతిక పురోగతిని పూర్తిగా నిలిపివేయాలని తాను కోరడం లేదని డారియో స్పష్టం చేశారు. అయితే ఏఐ కంపెనీలు తమ మోడళ్ల భద్రతను గణనీయంగా పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏఐ అభివృద్ధి వేగానికి అనుగుణంగా భద్రతా వ్యవస్థలను బలోపేతం చేసుకునేందుకు కంపెనీలకు తగిన సమయం అవసరమన్నారు. ఇదే అంశంపై ఆయన మూడు దశల పరిష్కార ప్రణాళికను ప్రతిపాదించారు.

**డారియో మూడు సూచనలు:** ఏఐ వినియోగంలో భద్రతా ప్రమాణాలను నిరంతరం పర్యవేక్షించే స్వతంత్ర నిపుణులను కంపెనీల్లో నియమించాలి. భద్రతా ప్రమాణాలను రూపొందించేందుకు, అనియంత్రిత ఏఐ అభివృద్ధిని అడ్డుకునేందుకు అగ్రగామి ఏఐ సంస్థలు పరస్పరం సమన్వయంతో పనిచేయాలి. శక్తిమంతమవుతున్న ఏఐ వ్యవస్థల వల్ల తలెత్తే ప్రమాదాలను గుర్తించి ఎదుర్కొనేందుకు ప్రపంచ దేశాలు కలిసి పనిచేయాలి.

ఇదిలా ఉండగా.. ఇరాన్‌కు మద్దతిస్తున్న యెమెన్‌కు చెందిన హూతీలు క్షిపణుల అభివృద్ధికి తమ 'క్లాడ్' ఏఐ చాట్‌బాట్‌ను ఉపయోగిస్తున్నట్లు ఆంత్రోపిక్ ఇటీవల ఓ నివేదికలో పేర్కొంది. ఈ నేపథ్యంలో డారియో తాజా హెచ్చరికలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# ప్రపంచ సవాళ్లకు.. బ్రిక్స్ సంసిద్ధం!

(మొదటి పేజీ తరువాయి)

బ్రిక్స్ మూడో దశాబ్దంలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో ప్రపంచం తమ నుంచి కేవలం ఆలోచనలు, హామీలనే కాకుండా నిర్దిష్ట ఫలితాలను ఆశిస్తోందని మోదీ పేర్కొన్నారు. తదుపరి బ్రిక్స్ సదస్సుకు ఆతిథ్యమివ్వనున్న చైనాకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మూడు రోజుల సదస్సు సందర్భంగా వివిధ దేశాధినేతలు, ప్రభుత్వాధినేతలతో మోదీ 15 ద్వైపాక్షిక భేటీలు నిర్వహించారు.



**సభ్య దేశాల అభివృద్ధికి వ్యాపార మండలి :** బ్రిక్స్ వ్యాపార మండలి సభ్య దేశాల అభివృద్ధికి గణనీయమైన తోడ్పాటు అందించిందని మోదీ తెలిపారు. పరస్పర సహకారాన్ని మరింత విస్తరించడం ద్వారా సమ్మిళిత వృద్ధిని సాధించవచ్చని పేర్కొన్నారు.

**ప్రపంచం మారుతోంది: జిన్‌పింగ్ :** ప్రపంచం ఒక శతాబ్దంలో కనీవినీ ఎరుగని కీలక మార్పులకు గురవుతోందని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ అన్నారు. గ్లోబల్ సౌత్ దేశాలు సమిష్టిగా ఎదుగుతూ బహుళ ధ్రువ ప్రపంచానికి ప్రధాన చోదక శక్తిగా మారుతున్నాయని పేర్కొన్నారు.

అంతర్జాతీయ పరిస్థితులు సంక్లిష్టంగా, అస్థిరంగా మారుతున్న నేపథ్యంలో బ్రిక్స్ దేశాలు చొరవ తీసుకుని గ్లోబల్ సౌత్‌లోని అత్యధిక దేశాలతో ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. సార్వభౌమ సమానత్వం, అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోకపోవడం, వివాదాల శాంతియుత పరిష్కారం వంటి ప్రాథమిక నియమాలను కాపాడుకోవాలని సూచించారు. అంతర్జాతీయ చట్టాన్ని ద్వంద్వ ప్రమాణాలు లేకుండా సమానంగా అమలు చేయాలని అన్నారు.

**బ్రిక్స్ కోసం ఓపెన్‌సోర్స్ ఏఐ జోన్ :** బ్రిక్స్ దేశాల కోసం 'కృత్రిమ మేధ (ఏఐ) ఓపెన్‌సోర్స్ జోన్' ఏర్పాటుకు చైనా నేతృత్వం వహిస్తుందని జిన్‌పింగ్ ప్రకటించారు. పెద్ద భాషా నమూనాల (ఎల్ఎల్ఎం) అభివృద్ధి, అనువర్తనాల్లో సహకారానికి మద్దతు ఇస్తామని తెలిపారు. పారిశ్రామిక, సరఫరా వ్యవస్థల స్థిరత్వం కోసం ఐదు కొత్త కార్యక్రమాలను ప్రతిపాదించారు.

మోదీతో భేటీ సందర్భంగా భారత్, చైనా అనేక అంశాల్లో భిన్నంగా ఉన్నప్పటికీ పరస్పరం బలాలను పూర్తి చేసుకుంటూ, మద్దతు ఇచ్చుకుంటూ ఉమ్మడి విజయాన్ని సాధించగలమని జిన్‌పింగ్ వ్యాఖ్యానించారు.

**కొత్త బీమా యంత్రాంగం: పుతిన్ :** ప్రస్తుత ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనేందుకు బ్రిక్స్ దేశాలు సమగ్ర విధానాన్ని అనుసరించాలని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పిలుపునిచ్చారు. బ్రిక్స్, గ్లోబల్ సౌత్ దేశాల ఆర్థిక వృద్ధికి కొత్త బీమా యంత్రాంగాన్ని, ధాన్యం మార్కెట్ కోసం సహకార కార్యక్రమాన్ని ప్రతిపాదించారు.



18వ బ్రిక్స్ సదస్సు ముగింపు సమావేశంలో పుతిన్ మాట్లాడుతూ తమ ప్రతిపాదనలను ఇతర సభ్య దేశాలు వినియోగించుకోవాలని ఆహ్వానించారు. న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డీబీ) 140 బిలియన్ డాలర్ల విలువైన ప్రాజెక్టులను నిర్వహిస్తోందని ప్రశంసించారు.

**ఒకే ఫ్రేమ్‌లో మోదీ, పుతిన్, జిన్‌పింగ్ :** సదస్సు ముగింపు సందర్భంగా భారత్ మండపంలో బ్రిక్స్ దేశాధినేతలు 'ఫ్యామిలీ ఫొటో' దిగారు. ముందువరుసలో పుతిన్, మోదీ, జిన్‌పింగ్ పక్కపక్కనే నిలబడి నవ్వుతూ కనిపించిన దృశ్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ ముగ్గురూ వరుసగా మూడోసారి బ్రిక్స్ వేదికపై కనిపించడం విశేషం.

2024లో కజాన్, 2025లో తియాంజిన్‌లో జరిగిన బ్రిక్స్ సమావేశాల అనంతరం ఇప్పుడు న్యూఢిల్లీలో వారు కలుసుకున్నారు. 2020 గల్వాన్ ఘర్షణ తర్వాత దెబ్బతిన్న భారత్–చైనా సంబంధాలను తిరిగి గాడిలో పెట్టేందుకు ఇరుదేశాలూ ప్రయత్నిస్తున్న సమయంలో జిన్‌పింగ్ భారత్‌కు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఈ సదస్సుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, అబుదాబి క్రౌన్ ప్రిన్స్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ సహా పలువురు ప్రపంచ నేతలు హాజరయ్యారు. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియా అస్థిరత, అమెరికా కొత్త సుంకాల విధానం నేపథ్యంలో ఈ సదస్సుకు మరింత ప్రాధాన్యం లభించింది.

# అంటువ్యాధులపై అప్రమత్తం

(మొదటి పేజీ తరువాయి)



అల్లూరి సీతారామరాజు, పోలవరం, పార్వతీపురం మన్యం, ఏలూరు ప్రాంతాల్లో రెండో విడత ఇళ్లలో మందు పిచికారీని పూర్తి చేయనున్నారు. అవసరాన్ని బట్టి ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో అదనపు విడత మందు పిచికారీ కూడా చేపట్టనున్నారు. అర్హులైన వారికి 5,99,367 దోమతెరల పంపిణీ చర్యలు మొదలయ్యాయి.

**డెంగ్యూ కేసులు పెరిగాయి :** ఆగస్టు 30 నాటికి రాష్ట్రంలో 1,475 డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. గత ఏడాది ఇదే సమయానికి 1,410 కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది కేసులు 4.6 శాతం పెరిగాయి.

వైఎస్సార్ కడపలో కేసులు 48 నుంచి 128కు, చిత్తూరులో 73 నుంచి 112కు పెరిగాయి.

కర్నూలులో మాత్రం 182 నుంచి 106కు, అనకాపల్లిలో 99 నుంచి 64కు కేసులు తగ్గాయి.

డెంగ్యూ కేసులు నమోదైన ప్రాంతాల్లో వెంటనే దోమల నియంత్రణ చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. కేసుల చుట్టుపక్కల ఇళ్లలో మందు పిచికారీ, పొగ మందు కొట్టడం, దోమల పిల్లలను తొలగించడం వంటి చర్యలు చేపట్టనున్నారు.

**స్క్రబ్ టైఫస్‌పై ప్రత్యేక దృష్టి :** ఈ ఏడాది ఇప్పటివరకు రాష్ట్రంలో 941 స్క్రబ్ టైఫస్ కేసులు నమోదయ్యాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలో కేసులు 13 నుంచి 44కు, పార్వతీపురం మన్యం జిల్లాలో 15 నుంచి 47కు పెరిగాయి. అటవీ ప్రాంతాల సమీపంలో జ్వరంతో బాధపడుతున్న వారికి త్వరగా పరీక్షలు చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. వ్యాధిని త్వరగా గుర్తించి చికిత్స అందేలా చూడాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

**శ్రీకాకుళంలో తాగునీరు, ఆహారం పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ :** శ్రీకాకుళం జిల్లాలో ఆహారం ద్వారా వచ్చే వ్యాధుల కేసులు గత ఏడాది 34 ఉండగా, ఈ ఏడాది 408కు పెరిగాయి. దీంతో తాగునీటి వనరులను పరిశీలించనున్నారు. నీటిని శుభ్రపరిచే చర్యలు చేపట్టనున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ఆహార పదార్థాల నాణ్యతను కూడా పరిశీలించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది ఇప్పటివరకు ఆహారం ద్వారా వచ్చే వ్యాధులకు సంబంధించిన 930 కేసులు నమోదయ్యాయి.

**కర్నూలులో తాగునీటిపై పరిశీలన :** కర్నూలు జిల్లాలో ఈ ఏడాది టైఫాయిడ్ కేసుల కాస్త ఎక్కువగా నమోదయ్యాయి. దీంతో తాగునీటి వనరులను అధికారులు పరిశీలించనున్నారు. అవసరమైన చోట నీటిని శుభ్రపరిచే చర్యలు చేపట్టనున్నారు. పారిశుద్ధ్య పనులను కూడా మరింత బలోపేతం చేయనున్నారు.

డెంగ్యూ, మలేరియా వ్యాప్తికి కారణమయ్యే దోమల నియంత్రణలో భాగంగా ప్రతి శుక్రవారండ్రైడే (ఇళ్లలో, ఇళ్ల చుట్టుపక్కల నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి నీటిని తొలగించే కార్యక్రమం) నిర్వహించనున్నారు.

నీరు నిలిచే పాత్రలు, పనికిరాని వస్తువులు, ఇతర ప్రదేశాలను పరిశీలించి వాటిలో నీరు నిల్వ లేకుండా చూడాలి. ఇలా చేయడం ద్వారా దోమల పిల్లలు పెరిగే అవకాశాన్ని తగ్గించవచ్చు. ప్రతి వారం దోమలు పెరిగే ప్రాంతాలను గుర్తించి దోమల పిల్లలను తొలగించే చర్యలు చేపట్టనున్నారు. అవసరమైన చోట దోమల పిల్లలను నియంత్రించే చర్యలు చేపట్టడంతో పాటు, అనుకూలమైన ప్రాంతాల్లో చేపల ద్వారా కూడా దోమల పిల్లలను నియంత్రించనున్నారు.

ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, ప్రజలు భాగస్వాములు కానున్నారు. కార్యక్రమం అమలును యాప్ ద్వారా పర్యవేక్షించనున్నారు.

**ముందుగానే గుర్తించి చర్యలు :** అంటువ్యాధులు ఎక్కడ ఎక్కువగా వ్యాపిస్తున్నాయో ముందుగానే గుర్తించేందుకు ప్రత్యేక సమాచార వ్యవస్థలను ఉపయోగిస్తున్నారు. జిల్లాల నుంచి వచ్చే వివరాలను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. ఏ ప్రాంతంలోనైనా కేసులు పెరుగుతున్నట్లు గుర్తిస్తే అక్కడ వెంటనే అవసరమైన నివారణ చర్యలు చేపట్టేలా ఏర్పాట్లు చేస్తున్నారు. దోమల పెరుగుదలకు కారణమయ్యే నీరు నిలిచే ప్రాంతాలు, పూడికపడిన కాలువలు, చెత్త కుప్పలు, బయట దోమలు పెరిగే ప్రదేశాలను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోనున్నారు.

**శాఖల సమన్వయంతో నివారణ చర్యలు :** మలేరియాను అరికట్టేందుకు మందు పిచికారీ, దోమతెరల పంపిణీ, దోమల పిల్లలను తొలగించడం వంటి చర్యలు చేపడుతున్నారు. డెంగ్యూ నివారణకు కేసులు నమోదైన ప్రాంతాల్లో వెంటనే దోమల నియంత్రణ చర్యలు, ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమం, దోమల పెరుగుదల ప్రాంతాల నిర్మూలన వంటి చర్యలను కొనసాగించనున్నారు.

నీరు, ఆహారం ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టేందుకు తాగునీటిని శుభ్రపరచడం, పారిశుద్ధ్య పనులు చేపట్టడం, ఆహార పదార్థాలను తనిఖీ చేయడం వంటి చర్యలను సమన్వయంతో చేపట్టనున్నారు. గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి, వైద్య ఆరోగ్యశాఖల మధ్య సమన్వయంతో దోమల పెరుగుదలకు కారణమయ్యే ప్రాంతాలను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోనున్నారు.

## 2029 నాటికి 21 రాష్ట్రాల్లో యుసిసి



(మొదటి పేజీ తరువాయి)

యుసిసికి బీజేపీ కట్టుబడి ఉందని, ఇది ప్రధాని మోదీ ఇచ్చిన హామీ అని అమిత్‌షా స్పష్టం చేశారు. ఇప్పటికే ట్రిపుల్ తలాక్‌ను రద్దు చేశామని, పలు రాష్ట్రాల్లో యుసిసిని అమలు చేస్తున్నామని చెప్పారు.

**నేర న్యాయ వ్యవస్థ బలోపేతం :** 'భారతీయ న్యాయ సంహిత' ద్వారా దేశ నేర న్యాయ వ్యవస్థను బలోపేతం చేశామని అమిత్‌షా తెలిపారు. అనేక రాష్ట్రాల్లో నేరస్తులకు శిక్ష పడే రేటు ఒక్క ఏడాదిలోనే 30 శాతం పెరిగిందన్నారు. మూడేళ్లలోపు న్యాయం అందేలా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

**రక్తపాతం లేకుండా 370 రద్దు :** ఆర్టికల్ 370, 35ఎ రద్దు ప్రక్రియ ఒక్క చుక్క రక్తం చిందకుండా, ఒక్క బుల్లెట్ కూడా కాల్చకుండా విజయవంతంగా పూర్తయిందని అమిత్‌షా పేర్కొన్నారు. ఐదు దశాబ్దాల నక్సలిజానికి ముగింపు పలికామని, 14కు పైగా శాంతి ఒప్పందాలు కుదుర్చుకున్నామని తెలిపారు. తొమ్మిది వేల మందికి పైగా నక్సలైట్లు లొంగిపోయారని చెప్పారు.

**ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ :** సర్జికల్ స్ట్రైక్స్, వైమానిక దాడులు, 'ఆపరేషన్ సింధూర్' వంటి చర్యల ద్వారా ఉగ్రవాదంపై 'జీరో టాలరెన్స్' విధానాన్ని అమలు చేస్తున్నామని అమిత్‌షా తెలిపారు.

**ఎన్‌ఆర్‌సీపై చర్చలు :** మణిపూర్‌లో 'నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్' (ఎన్‌ఆర్‌సీ) అమలుకు 1951 నాటి ప్రాతిపదికను ఉపయోగించడంపై మిత్రపక్షాలు, రాజకీయ పార్టీలతో చర్చలు జరుపుతున్నట్లు చెప్పారు. బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా వచ్చిన చొరబాటుదారులను ముంబై వంటి నగరాల్లో గుర్తించేందుకు ఉపయోగించే పద్ధతులు, సాధనాలను వెల్లడించబోమని తెలిపారు.

**నషా ముక్త్ భారత్ అభియాన్ :** మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా 'నషా ముక్త్ భారత్ అభియాన్'ను ప్రారంభించానని అమిత్‌షా చెప్పారు. ప్రతి రాష్ట్రాన్ని సందర్శించి, ఈ ప్రచారాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్తామని తెలిపారు.

# ఎల్-నినోను ఎదుర్కొందాం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో జూన్ 1 నుంచి సెప్టెంబర్ 12 వరకు సాధారణంగా 476.1 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 218.2 మి.మీ. మాత్రమే నమోదైందని అధికారులు మంత్రికి వివరించారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 54.2 శాతం వర్షపాతం లోటు నమోదైందన్నారు. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని వర్షాభావ ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు.

ఖరీఫ్–2026లో సెప్టెంబర్ 12 నాటికి రాష్ట్రవ్యాప్తంగా 26.50 లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యాయని అధికారులు తెలిపారు. ఇది సాధారణ సాగు విస్తీర్ణంలో 74 శాతం కాగా, గత ఏడాది ఇదే తేదీ నాటి సాగుతో పోలిస్తే 78 శాతంగా ఉందన్నారు. ప్రధాన పంటల్లో వరి 12.01 లక్షల హెక్టార్లు, పత్తి 4.11 లక్షల హెక్టార్లు, కంది 2.63 లక్షల హెక్టార్లు, వేరుశనగ 1.47 లక్షల హెక్టార్లు, మొక్కజొన్న 1.08 లక్షల హెక్టార్లలో సాగైనట్లు వివరించారు.

ఎల్–నినో ప్రభావంతో రాష్ట్రంలోని 284 మండలాలు, 1,792 ఆర్ఎస్‌కేలు/గ్రామాల పరిధిలో పంటలపై ప్రభావం నమోదైనట్లు సమావేశంలో అధికారులు వెల్లడించారు. మొత్తం 2,44,443 హెక్టార్లలో పంటలు వివిధ స్థాయిల్లో ప్రభావితమైనట్లు తెలిపారు. ఇందులో 1,92,387 హెక్టార్లలో తేమ ఒత్తిడి, 41,474 హెక్టార్లలో పంటలు వాడిపోవడం, మరో 10,582 హెక్టార్లలో పంటలు ఎండిపోవడం నమోదైనట్లు వివరించారు.

ఈ పరిస్థితిపై మంత్రి అచ్చెన్నాయుడు స్పందిస్తూ తేమ ఒత్తిడిలో ఉన్న పంటలను సాధ్యమైనంత వరకు కాపాడటమే ప్రస్తుతం అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు ఎప్పటికప్పుడు అందించాలని, అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు.



జిల్లాల వారీగా కర్నూలు జిల్లాలో అత్యధికంగా 1,09,255 హెక్టార్లు, నంద్యాల జిల్లాలో 80,751 హెక్టార్లు, అనంతపురం జిల్లాలో 32,456 హెక్టార్లలో పంటలు ప్రభావితమైనట్లు అధికారులు తెలిపారు. ప్రభావం ఎక్కువగా ఉన్న జిల్లాల్లో వ్యవసాయ, జలవనరుల శాఖల అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్లాలని మంత్రి ఆదేశించారు. పంటల వారీగా కంది 74,301 హెక్టార్లు, పత్తి 73,733 హెక్టార్లు, వేరుశనగ 25,818 హెక్టార్లు, మొక్కజొన్న 24,819 హెక్టార్లు, వరి 18,443 హెక్టార్లలో ప్రభావితమైనట్లు సమావేశంలో వివరించారు.


**99.76 శాతం ప్లాట్ల సర్వే పూర్తి :** ఈ–పంట, వీడజు ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 2.7558 కోట్ల ప్లాట్లలో 2.7493 కోట్ల ప్లాట్ల సర్వే పూర్తయిందని, తద్వారా 99.76 శాతం సర్వే పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు. కేవలం 65,233 ప్లాట్లు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. మిగిలిన సర్వేను కూడా త్వరితగతిన పూర్తి చేసి క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులను నమోదు చేయాలని మంత్రి ఆదేశించారు. పంట ఆరోగ్య వివరాలకు సంబంధించి 1.082 కోట్ల ప్లాట్లలో వివరాలు నవీకరించాల్సి ఉండగా, ఇప్పటివరకు 98.10 లక్షల ప్లాట్లలో నవీకరణ పూర్తయిందని అధికారులు వివరించారు. ఇంకా 10.10 లక్షల ప్లాట్లు, అంటే 9.34 శాతం పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు.

దీనిపై మంత్రి అచ్చెన్నాయుడు స్పందిస్తూ పంట ఆరోగ్య వివరాల నమోదు కేవలం గణాంకాల కోసం కాకుండా, ఏ ప్రాంతంలో ఏ పంటకు ఎలాంటి సమస్య ఉందో గుర్తించి సకాలంలో రైతుకు సహాయం అందించేందుకు అత్యంత కీలకమన్నారు. ప్రతి ప్లాట్‌లో పంట ఆరోగ్యాన్ని పర్యవేక్షించి, పెండింగ్‌లో ఉన్న వివరాల నవీకరణను వేగంగా పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని పంటల వైవిధ్యీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు. ఇప్పటివరకు 34,567 హెక్టార్లలో ప్రత్యామ్నాయ పంటలు చేపట్టినట్లు అధికారులు వివరించగా, ఇంకా 95,112 హెక్టార్లను కవర్ చేయాల్సి ఉందన్నారు. తక్కువ నీటి అవసరమయ్యే, ప్రస్తుత వాతావరణ పరిస్థితులను తట్టుకునే పంటలను గుర్తించి రైతులను ప్రోత్సహించాలని మంత్రి ఆదేశించారు. రైతులకు విత్తనాలు, సాంకేతిక సలహాలు సహా అవసరమైన సహకారం అందుబాటులో ఉంచాలని సూచించారు.

**వ్యవసాయ-జలవనరుల శాఖల మధ్య నిరంతర సమన్వయం :** తేమ ఒత్తిడికి గురైన పంటలకు అందుబాటులో ఉన్న నీటి వనరులను వినియోగించి రక్షక తడులు అందించడంపై వ్యవసాయ, జలవనరుల శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. ఏ ప్రాంతంలో పంటకు నీరు అత్యవసరమో గుర్తించాలి. అందుబాటులో ఉన్న నీటిని ప్రాధాన్యతా క్రమంలో వినియోగించాలి. సాధ్యమైన ప్రతి పంటను కాపాడాలి. రైతుకు ప్రభుత్వం అండగా ఉందనే భరోసా క్షేత్రస్థాయిలో కనిపించాలి అని మంత్రి స్పష్టం చేశారు. నాగార్జునసాగర్, శ్రీశైలం జలాశయాల కింద సాగు చేసే రైతులు వరికాకుండా ఆరుతడి పంటలను పండించాలని నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. ఎల్–నినో పరిస్థితులను ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని, పరిస్థితులకు అనుగుణంగా కార్యాచరణను ఎప్పటికప్పుడు మార్చుకుంటూ రైతుల ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యంగా ముందుకు సాగాలని అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు దిశానిర్దేశం చేశారు.

ఈ ఉన్నతస్థాయి సమీక్షలో నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, వ్యవసాయ––సహకార శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్, ఉద్యానవన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ రాజుని కుమారి, మత్స్య శాఖ కమిషనర్ రామ శంకర్ నాయక్, జలవనరుల శాఖ ఇంజనీర్–ఇన్–చీఫ్, జలవనరుల శాఖ కార్యదర్శి, ఐఏఎస్ రాజమౌళి, వ్యవసాయ, జలవనరుల శాఖలకు చెందిన వివిధ విభాగాధిపతులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 15 దేశాల అధినేతలతో ప్రధాని చర్చలు



**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి హాజరైన 15 దేశాల అధినేతలు, అంతర్జాతీయ సంస్థల నేతలతో ప్రధాని నరేంద్రమోడీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఆయా దేశాలు, సంస్థలతో సంబంధాల బలోపేతంపై చర్చించారు. దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసా, ఆఫ్రికన్ యూనియన్ ఛైర్‌పర్సన్, బురుండి రిపబ్లిక్ అధ్యక్షుడు ఎవరిస్ట్ నదయిషిమియే, ఫిలిప్పీన్స్ రిపబ్లిక్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ ఆర్. మార్కోస్ జూనియర్, నైజీరియా ఉపాధ్యక్షుడు కాశీం షెట్టిమా ముస్తఫా తదితరులతో ప్రధాని నరేంద్ర మోడీ ఆదివారం విడివిడిగా భేటీ అ-య్యారు.

**సిరిల్ రామఫోసాతో.... :** దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసాతో ప్రధాని మోడీ భేటీ అయ్యారు. ఇద్దరు నాయకులు వివిధ సహకార రంగాలలో సాధించిన పురోగతిని సమీక్షించారని, ఇరు దేశాల మధ్య ఉన్న బహుముఖ వ్యూహాత్మక భాగస్వామ్యంపై అభిప్రాయాలను పంచుకున్నారని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. బహుపాక్షిక వేదికలలో సన్నిహిత సమన్వయాన్ని కొనసాగించడానికి ఇరువురు నేతలు అంగీకరించారని పేర్కొంది. దక్షిణాఫ్రికా నుంచి భారతదేశానికి చిరుతలను విజయవంతంగా తరలించిన నేపథ్యంలో, అంతర్జాతీయ బిగ్ క్యాట్ అలయన్స్‌లో చేరడాన్ని పరిశీలించాలని దక్షిణాఫ్రికాను మోడీ ఆహ్వానించారని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది.

**ఆఫ్రికన్ యూనియన్ ఛైర్‌పర్సన్‌తో చర్చలు :** ఆఫ్రికన్ యూనియన్ ఛైర్‌పర్సన్, బురుండి రిపబ్లిక్ అధ్యక్షుడు ఎవరిస్ట్ నదయిషిమియేతో ప్రధాని మోడీ ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. 2023లో ఆఫ్రికన్ యూనియన్‌ను జి 20 కూటమిలోకి తీసుకురావడంలో భారతదేశం పోషించిన పాత్రను గుర్తుచేసుకుంటూ, గ్లోబల్ సౌత్‌లో సహకారానికి భారత్ – ఆఫ్రికన్ యూనియన్ భాగస్వామ్యం ఒక కీలక పునాది అని, ఇరు దేశాల మధ్య పలు రంగాల్లో సంబంధాలను మెరుగుపరుచుకోవాలని ఇద్దరు నేతలు నిర్ణయించారని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. 4వ భారత్–ఆఫ్రికా ఫోరం సదస్సును త్వరగా నిర్వహించాలని అభిప్రాయపడ్డారు.

**ఫిలిప్పీన్స్ అధ్యక్షుడితో భేటీ :** ఫిలిప్పీన్స్ రిపబ్లిక్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ ఆర్. మార్కోస్ జూనియర్‌తో ప్రధాని భేటీ అయ్యారు. రక్షణ, భద్రత, వాణిజ్యం, పెట్టుబడులు, అంతరిక్షం, రైల్వే మౌలిక సదుపాయాలు, విద్య, పర్యాటకం, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఆవిష్కరణలు, ప్రజల మధ్య సంబంధాల రంగాలలో సహకారాన్ని మరింతగా పెంపొందించుకోవాలని, విస్తరించుకోవాలని నిర్ణయించినట్లు విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది.

**భారత్-కజకిస్తాన్ ద్వైపాక్షిక చర్చలు :** కజకిస్తాన్ రిపబ్లిక్ అధ్యక్షుడు కాస్సిమ్–జోమార్ట్ టోకాయేవ్‌తో మోడీ ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. ఇరు దేశాల మధ్య పలు రంగాల్లో ఉన్న సంబంధాలను నాయకులు సమీక్షించారని, ఇటీవలి సంవత్సరాలలో ఇరు దేశాల సంబంధాలు స్థిరంగా అభివృద్ధి చెందడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారని విదేశాంగశాఖ పేర్కొంది.

**నైజీరియా ఉపాధ్యక్షుడితో భేటీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, నైజీరియా ఉపాధ్యక్షుడు కాశీం షెట్టిమా ముస్తఫాతో భేటీ అయ్యారు. భారత్ – నైజీరియా బహుముఖ సంబంధాలను నేతలు సమీక్షించారని, ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయాలని నిర్ణయించారని విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, భద్రత, ఇంధన భాగస్వామ్యం, వ్యవసాయం, ఆరోగ్యం, డిజిటల్ టెక్నాలజీలతో సహా కీలక రంగాలపై చర్చించినట్లు తెలిపింది.

**ఉగాండా రిపబ్లిక్ ఉపాధ్యక్షురాలితో భేటీ :** ఉగాండా రిపబ్లిక్ ఉపాధ్యక్షురాలు జెస్సికా రోజ్ ఎపెల్ అలుపోతో ప్రధాని సమావేశమయ్యారు. "సాంకేతిక భాగస్వామ్యాలు, సామర్థ్య నిర్మాణం, జ్ఞాన భాగస్వామ్యం, పెట్టుబడుల సౌలభ్యం, ఇరు దేశాల మధ్య ప్రైవేట్ రంగ సహకారం ద్వారా కీలక ప్రాధాన్యతా రంగాలలో సహకారాన్ని పెంపొందించుకోవాలని నిర్ణయించారు. పరివర్తన చెందిన, సంపన్న ఉగాండా కోసం రూపొందించిన 'విజన్ 2040'కి భారతదేశం మద్దతు ఇస్తుందని మోడీ తెలిపారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంను అల్పాహార సమావేశానికి ఆహ్వానించి, భారత్–మలేషియా సంబంధాలపై చర్చించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా కూడా పాల్గొన్నారు. వాణిజ్యం, సెమీకండక్టర్లు, మౌలిక సదుపాయాలు, రక్షణ రంగాలలో సహకారంపై దృష్టి సారించి ప్రధాని నరేంద్ర మోడీ, ఇబ్రహీం చర్చలు జరిపిన ఒక రోజు తర్వాత ఈ సమావేశం జరిగింది.

## మణిపూర్‌లో ఆగని హింసాకాండ



**ఇంఫాల్ :** మణిపూర్‌లో ఏళ్లు గడుస్తున్నా.. హింసాకాండ ఆగడం లేదు. రాష్ట్రంలో తాజాగా చెలరేగిన హింసాకాండలో ఒక మహిళ మృతి చెందగా, ఆమె భర్త, కుమారుడు తీవ్రంగా గాయపడ్డారు. టమెంగ్‌లాంగ్ జిల్లాలో జాతీయ రహదారి–37కు అనుకుని ఉన్న టోలెన్ గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. గుర్తుతెలియని దుండగులు ఒక కుటుంబంపై కాల్పులు జరపడంతో లింగ్జాంగై సింగ్సిట్ అనే మహిళ ప్రాణాలు కోల్పోయారు. ఆమె భర్త సెయినెహ్ సింగ్సిట్, వారి ఆరేళ్ల కుమారుడు గాయపడ్డారు. సింగ్సిట్ మరో ఇద్దరు పిల్లలు తప్పించుకున్నట్లు సమాచారం. ఈ ఘటనాస్థలానికి చేరుకున్న కైమై అస్సాం రైఫిల్స్ సిబ్బంది, గాయపడిన తండ్రి, కుమారుడిని తక్షణ వైద్య చికిత్స కోసం జిరిబామ్‌కు తరలించారు. ఈ దాడితో జాతీయ రహదారి–37కు సమీపంలో ఉన్న గ్రామాల్లో ఆందోళన నెలకొంది. ఈ జాతీయ రహదారి మణిపూర్ రాజధాని ఇంఫాల్‌ను జిరిబామ్‌తో అనుసంధానిస్తుంది.

**సమగ్ర దర్యాప్తు జరిపి, దోషులను శిక్షించాలి :** ఈ ఘటనను కుకీ యూత్ ఆర్గనైజేషన్ (కెవైఓ) మహిళా మండలి తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనపై తక్షణమే నిష్పక్షపాతంగా, సమగ్రంగా దర్యాప్తు జరిపి, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది. భద్రతా దళాలు మోహరించిన ప్రాంతానికి కొన్ని వందల మీటర్ల దూరంలోనే ఈ దాడి ఎలా జరిగిందని ప్రశ్నించింది. ఇలాంటి ఘటనలు భద్రతా ఏర్పాట్లపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది.

## సముద్రం అడుగున బంగారం, వెండి నిధి.. !



**బీజింగ్ :** పశ్చిమ పసిఫిక్ మహాసముద్రంలో చైనా శాస్త్రవేత్తలు భారీ ఖనిజ నిక్షేపాలను గుర్తించారు. సముద్ర గర్భంలో నిర్వహించిన పరిశోధనల్లో బంగారం, వెండితో పాటు రాగి, ఇనుము, జింక్ వంటి విలువైన ఖనిజాలు పెద్ద మొత్తంలో ఉన్నట్లు వెల్లడైంది.

సింఘువా యూనివర్సిటీ, షాంఘై జియావో టాంగ్ యూనివర్సిటీ సహా పలు సంస్థల పరిశోధకులు 'జియాంగ్ యాంగ్ హాంగ్ 10' నౌకలో చేపట్టిన పరిశోధనలో ఈ నిక్షేపాలను గుర్తించారు. సేకరించిన నమూనాలను నౌకలోని ప్రయోగశాలలో పరీక్షించగా ఒక టన్ను ఖనిజంలో 15.4 గ్రాముల వరకు బంగారం, 1,271 గ్రాముల వరకు వెండి ఉన్నట్లు తేలింది.

చైనా ప్రత్యేక ఆర్థిక మండలి పరిధిలోని సముద్ర ప్రాంతంలో 700 నుంచి 1,500 మీటర్ల లోతులో ఈ హైడ్రోథర్మల్ ఖనిజ క్షేత్రం ఉన్నట్లు పరిశోధకులు తెలిపారు. ఇక్కడ సముద్రపు నీటి ఉష్ణోగ్రత 315 డిగ్రీల సెల్సియస్‌కు పైగా ఉంటుందని గుర్తించారు. మూడు పెద్ద శంఖాకార నిర్మాణాలతో ఉన్న ఈ ప్రాంతం భవిష్యత్తులో ప్రపంచస్థాయి సముద్రగర్భ ఖనిజ నిక్షేపంగా మారే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు.

నిక్షేపాల పూర్తి పరిమాణం, ఆర్థిక విలువను అంచనా వేసేందుకు చైనా 2027లో మరింత విస్తృతమైన సర్వేలు నిర్వహించనుంది. అయితే ఇంతటి లోతులోని ఖనిజాలను వెలికితీయడం సాంకేతికంగా అత్యంత క్లిష్టమైన ప్రక్రియ. ప్రస్తుతం ప్రపంచంలో ఇలాంటి లోతైన సముద్ర ప్రాంతాల్లో వాణిజ్య స్థాయిలో మైనింగ్ కార్యకలాపాలు జరగడం లేదు.

## కేంద్ర పథకాల నిధులపై ఏపీ ప్రభుత్వం కసరత్తు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఏపీలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు సజావుగా అమలయ్యేందుకు ఒక్కో రూపాయిని ఎలా సేకరించవచ్చో సర్కార్ కసరత్తు చేస్తోంది. ఈ మేరకు కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా వచ్చే నిధులకు, రాష్ట్ర వాటాను జతచేసి పలు కార్యక్రమాలు అమలుచేస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళలు, శిశువులు, గర్భిణులకు ప్రయోజనం కల్పించే సంక్షేమ పథకాలతో పాటు పల్లెల్లో ప్రగతి పనులకు కేంద్ర పథకాల ద్వారా గరిష్ఠంగా నిధులు రాబడుతోంది. కేంద్ర ప్రాయోజిత పథకాలకు : 2026–2027 ఆర్థిక సంవత్సరంలో ఏపీలో 86 కేంద్ర ప్రాయోజిత పథకాలకు రూ. 25,304 కోట్లు మంజూరు చేయించుకోగలిగింది. ఈ మొత్తం 2024–2025లో 14,109 కోట్లు, 2025–2026లో రూ. 15,126 కోట్లు మాత్రమే కావడం గమనార్హం. కేంద్ర ప్రభుత్వం నుంచి అదనపు నిధులు రాబట్టడంతో పాటు అవి సకాలంలో ఖర్చయ్యేలా సీఎం చంద్రబాబు ప్రభుత్వ శాఖలు, జిల్లా కలెక్టర్లకు మార్గదర్శనం చేస్తున్నారు. ఈ ఏడాది నాలుగో విడత నిధులు కేంద్రం నుంచి మంజూరు కావాల్సి ఉంది. ఆ మొత్తం కూడా సమకూరితే గత రెండు సంవత్సరాల్లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మొత్తానికి సమానంగా ఈ ఒక్క ఏడాదిలోనే సాధించినట్లు అవుతుంది. 2024–2025, 2025–2026 ఆర్థిక సంవత్సరాల్లో ఉమ్మడి పథకాలకు కేంద్ర, రాష్ట్ర వాటాలు కలిపి రూ. 38,115 కోట్లు వెచ్చించారు. తద్వారా రెండు కోట్ల మందికి లబ్ధి చేకూరింది. ప్రస్తుత ఆర్థిక ఏడాదిలో ఏపీకి కేంద్ర పథకాల కింద తొలి విడతలో వచ్చిన రూ. 8694 కోట్లు ఇప్పటికే వెచ్చించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 10,552 కోట్లు రాష్ట్ర ఖజానాకు జమ కాగా, వాటికి రాష్ట్ర ప్రభుత్వ వాటా కలిపి మొత్తం రూ. 18,516 కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉన్నాయి. మొత్తం 23 ప్రభుత్వ శాఖల్లో ఆరింటికి కేంద్రం ఈ సంవత్సరం రూ. 1000 కోట్లకు మించి మంజూరు చేసింది. ఒక్క పంచాయతీరాజ్ శాఖకే రూ. 11,184 కోట్లు మంజూరుకాగా, ఇప్పటికే రూ. 4461 కోట్లు రాష్ట్ర ఖజానాకు జమయ్యాయి. గృహనిర్మాణ శాఖకు రూ. 2500 కోట్లు, ప్రాథమికోన్నత విద్యకు రూ. 2351 కోట్లు, వైద్యారోగ్యశాఖకు రూ. 2232 కోట్లు, స్త్రీ, శిశు సంక్షేమానికి రూ. 1398 కోట్లు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖకు రూ. 1210 కోట్ల చొప్పున మంజూరయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చేలా కేంద్రం అమలు చేస్తున్న జలజీవన్ మిషన్ కింద వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఐదు సంవత్సరాల్లో కేవలం రూ. 2255 కోట్లు మాత్రమే వెచ్చించింది. ఈ పథకం గడువు ముగిసేలోగా ఏపీలోని 95.44 లక్షల కుటుంబాలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాలన్న లక్ష్యం నెరవేరలేదు. ఎన్డీయే సర్కార్ ఏర్పడ్డాక కేంద్రంతో చర్చించి, పథకం గడువు పొడిగింపజేయడంతో పాటు నిధుల సాధనపై దృష్టి పెట్టింది. ఈ సంవత్సరం కేంద్రం రూ. 2631 కోట్లు కేటాయించింది. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించే పోషణ్ 2.0 పథకంలో ఏపీకి రూ. 971 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో 20 లక్షల మందికి పైగా లబ్ధి కలగనుంది.

# గుచ్చిమి ఏనుగుల సంరక్షణ కేంద్రాన్ని సందర్శించిన ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ నాగబాబు

- గజరాజుల సంరక్షణపై ఆరా
- కుంకీ ఏనుగులకు ఆహారం అందించిన నాగబాబు
- ఖాళీ ప్రాంతాల్లో విస్తృతంగా మొక్కలు నాటాలని అధికారులకు సూచన



**పార్వతీపురం (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ నాగబాబు పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలంలోని గుచ్చిమి ఏనుగుల సంరక్షణ కేంద్రాన్ని ఆదివారం సందర్శించారు. పర్యటనలో భాగంగా గుచ్చిమి రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో రావి, వేప మొక్కలను నాటారు. అటవీ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ప్రతీ ప్రదేశంలో విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాలను ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. పచ్చదనం పెంపుతోపాటు అటవీ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. అనంతరం ఏనుగుల సంరక్షణ కేంద్రంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులను సమీక్షించారు. అడవి ఏనుగుల సంచారాన్ని క్షేత్రస్థాయిలో ఏ విధంగా పర్యవేక్షిస్తున్నారనే విషయాన్ని ఏనుగుల ట్రాకర్లను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.

**మానవ-వన్యప్రాణి ఘర్షణల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి :** వన్యప్రాణులు–మానవుల మధ్య ఘర్షణలను తగ్గించేందుకు అటవీ శాఖ చేపడుతున్న ముందస్తు చర్యలను పార్వతీపురం డీఎఫ్ఓ ఎస్. వెంకటేష్, ఎఫ్ఆర్ఓ తదితర అధికారులు మ్యాప్ సహాయంతో నాగబాబుకు వివరించారు. ఏనుగులు సంచరించే అటవీ ప్రాంతాల్లో నెలకొన్న కఠినమైన భౌగోళిక పరిస్థితులు, వాటి కదలికలను పర్యవేక్షించడంలో ఎదురవుతున్న ఇబ్బందులను, క్షేత్రస్థాయి పరిస్థితులను తెలియజేశారు. ఏనుగుల సంరక్షణతోపాటు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అటవీ శాఖ అధికారులు, సిబ్బంది చేస్తున్న క్షేత్రస్థాయి కృషిని నాగబాబు అభినందించారు.

**కుంకీ ఏనుగులకు చెరకు, బెల్లం తినిపించిన నాగబాబు :** అనంతరం గుచ్చిమి సంరక్షణ కేంద్రంలోని జయంత్, అభిమన్యు అనే రెండు కుంకీ ఏనుగుల మావటిలతోపాటు పశు వైద్యుడిని నాగబాబు కలిశారు. ఏనుగుల ఆరోగ్యం, వాటి సంరక్షణ, ఆహారపు విధానం తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కుంకీ ఏనుగులకు రాగి, స్వీట్ కార్న్, చెరకు, బెల్లం వంటి ఆహారాన్ని తినిపించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సలహాదారుడు పి. మల్లికార్జున రావు, ఏపీసీసీఎఫ్ రాహుల్ పాండే, సీసీఎఫ్ బి.ఎన్.ఎన్. మూర్తి, విశాఖపట్నం సర్కిల్ సీసీఎఫ్ ఐ.కె.వి. రాజు, పార్వతీపురం మన్యం డిఎఫ్ఓ ఎస్. వెంకటేష్, విజయనగరం డిఎఫ్ఓ సోమసుందరంతోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ అరణ్యలో తీవ్ర ఉద్రిక్తత..



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లాలో ఎర్రచందనం స్మగ్లర్లు మరోసారి రెచ్చిపోయారు. తమను అడ్డుకునేందుకు ప్రయత్నించిన అటవీ శాఖ అధికారులపై వాహనంతో దాడికి తెగబడ్డారు. ఈ ఘటనలో ముగ్గురు అటవీ శాఖ సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారు. ఆదివారం రొంపిచర్ల మండలం బొమ్మయ్యగారిపల్లి సమీపంలో ఈ సంఘటన చోటుచేసుకుంది.

వివరాల్లోకి వెళితే, ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో అటవీ శాఖ సిబ్బంది 'ఆపరేషన్ అరణ్య' చేపట్టారు. ఇందులో భాగంగా స్మగ్లర్ల వాహనాన్ని అడ్డుకునేందుకు తమ పెట్రోలింగ్ వాహనాన్ని రోడ్డుకు అడ్డంగా నిలిపారు. అయితే, అక్కడికి వేగంగా దూసుకొచ్చిన స్మగ్లర్లు ఆగకుండా, అధికారుల వాహనాన్ని బలంగా ఢీకొట్టి పారిపోయేందుకు ప్రయత్నించారు. ఈ ఘటనలో అటవీ శాఖ వాహనంతో పాటు స్మగ్లర్ల వాహనం కూడా దెబ్బతింది.

ఈ దాడిలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కె. ప్రకాశ్ కుమార్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు పి. రెడ్డి ప్రసాద్, కె. ప్రతాప్‌లతో పాటు వాహన డ్రైవర్ చరణ్‌కు గాయాలయ్యాయి. అయినప్పటికీ, అటవీ సిబ్బంది ప్రాణాలకు తెగించి ఇద్దరు స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నారు. స్మగ్లర్లలో ఇద్దరు గాయపడ్డారు. గాయపడిన సిబ్బందిని మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతిలోని ఎస్వీఆర్ఆర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగా ఉందని అధికారులు తెలిపారు. ఘటనా స్థలం నుంచి ఎర్రచందనం దుంగలు, ఒక తూకం యంత్రం, రంపం, గొడ్డళ్లు, స్మగ్లింగ్‌కు ఉపయోగించిన వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురు స్మగ్లర్లు పరారీలో ఉన్నట్లు గుర్తించారు.

**ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సీరియస్ :** అటవీ సిబ్బందిపై జరిగిన దాడి ఘటనపై ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. అటవీ శాఖ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఘటన వివరాలు తెలుసుకున్నారు. ప్రాణాలకు తెగించి స్మగ్లర్లను పట్టుకున్న అధికారుల ధైర్యాన్ని ఆయన అభినందించారు. గాయపడిన సిబ్బందికి మెరుగైన వైద్యం అందించాలని, చికిత్స ఖర్చు మొత్తం ప్రభుత్వమే భరిస్తుందని హామీ ఇచ్చారు. సిబ్బంది పూర్తిగా కోలుకునే వరకు పీసీసీఎఫ్ పర్యవేక్షించాలని ఆదేశించారు.

అటవీ సంపదను దోచుకునే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఈ విషయంలో ఎలాంటి రాజీకి తావులేదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ సిబ్బందిపై దాడులకు పాల్పడే వారిపై అత్యంత కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అటవీ నేరాలను అరికట్టడంలో తమ కూటమి ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉందని ఆయన పునరుద్ఘాటించారు. పరారీలో ఉన్న మిగతా ముగ్గురు నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని, స్మగ్లింగ్ ముఠాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని రెడ్ శాండర్స్ యాంటీ స్మగ్లింగ్ టాస్క్‌ఫోర్స్ అధికారులను ఆదేశించారు.

# డీఎస్సీపై గొడ్డలి పార్టీ దుష్ప్రచారం.. అభ్యర్థులే వాస్తవాలు చెబుతున్నారు

- చంద్రబాబు నాయకత్వంలో యువతకు ఉద్యోగ భరోసా.. లోకేశ్ చొరవతో నియామకాలకు వేగం
- డీఎస్సీ పై బురదజల్లడం జగన్ రెడ్డి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం
- పల్లా శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే



**విశాఖపట్నం, సెప్టెంబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** డీఎస్సీ ఎంపిక ప్రక్రియపై గొడ్డలి పార్టీ, జగన్ రెడ్డి చేస్తున్న దుష్ప్రచారానికి అభ్యర్థులే వాస్తవాలతో సమాధానం చెబుతున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందిన అభ్యర్థిని కలిసి ఎంపిక ప్రక్రియపై స్వయంగా వివరాలు తెలుసుకున్నారు. పరీక్ష, కౌన్సెలింగ్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రతి దశలోనూ పారదర్శకత పాటించామని అభ్యర్థి స్పష్టం చేసినట్లు పల్లా తెలిపారు.

**16 వేల పోస్టులు.. వంద శాతం పారదర్శకత :** డీఎస్సీ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించామని పల్లా తెలిపారు. 16 వేల పోస్టుల భర్తీలో ఎక్కడా చిన్నపాటి పొరపాటుకు కూడా తావులేకుండా ప్రతి దశను నిబంధనల ప్రకారం పూర్తి చేశామని స్పష్టం చేశారు. క్రీడా కోటాలోనూ అభ్యర్థుల అర్హతలు, ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి పూర్తి స్థాయిలో ధ్రువీకరణ చేపట్టామని చెప్పారు. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా వంద శాతం పారదర్శకంగా, మెరిట్ ప్రాతిపదికన నియామకాలు జరిగాయని పల్లా స్పష్టం చేశారు. ఎక్కడైనా అక్రమం జరిగిందని ఆరోపిస్తున్న వారు ఆధారాలతో ఫిర్యాదు చేయాలని సవాల్ విసిరారు.

**దొంగే దొంగ అన్నట్లు గొడ్డలి పార్టీ తీరు :** వైసీపీ హయాంలో డీఎస్సీ నిర్వహణలో నిర్లక్ష్యం చూపిన వారు ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేపట్టిన నియామక ప్రక్రియపై బురదజల్లడం విడ్డూరంగా ఉందని పల్లా మండిపడ్డారు. వైసీపీ హయాంలో ఏపీపీఎస్సీలో చోటుచేసుకున్న అక్రమాలు, అవకతవకలపై వాస్తవాలు వెలుగులోకి వస్తాయనే భయంతోనే ప్రజల దృష్టిని మళ్లించేందుకు డీఎస్సీపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని పల్లా విమర్శించారు. అభ్యర్థులు ఎన్నో నెలలు, సంవత్సరాలు కష్టపడి సాధించిన ఉద్యోగాలను రాజకీయ రాద్ధాంతంలోకి లాగడం జగన్ రెడ్డి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు.

**చంద్రబాబు పాలనలో యువతకు భరోసా :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పల్లా తెలిపారు. మంత్రి నారా లోకేశ్ చొరవతో నియామక ప్రక్రియలకు వేగం వచ్చిందని, మెరిట్‌కు పెద్దపీట వేస్తూ యువతకు భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల భవిష్యత్తుతో రాజకీయాలు చేయడం మానుకోవాలని జగన్ రెడ్డికి హితవు పలికారు. ఎన్ని కుట్రలు, ఎన్ని ఆరోపణలు చేసినా వాస్తవాలను కప్పిపుచ్చలేరని.. డీఎస్సీపై గొడ్డలి పార్టీ చేస్తున్న రాద్ధాంతాన్ని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని పల్లా స్పష్టం చేశారు.

## రాష్ట్రంలో లోక్ అదాలత్‌కు భారీ స్పందన

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన లోక్ అదాలత్‌లకు భారీ స్పందన లభించింది. శనివారం ఒక్క రోజే 2,22,770 పైగా కేసులు పరిష్కారమయ్యాయి. రూ. 212.49 కోట్లకు పైగా పరిహారం చెల్లింపునకు అవార్డులు జారీచేశారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్, ఏపీ న్యాయసేవాధికార సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షులు జస్టిస్ రవినాథ్ తిల్హారి, హైకోర్టు న్యాయసేవల కమిటీ ఛైర్మన్ జస్టిస్ బట్టు దేవానంద్ మార్గదర్శకాల్లో రాష్ట్రంలోని దిగువ న్యాయస్థానాల్లో శనివారం 441 లోక్ అదాలత్ బెంచ్‌లు నిర్వహించారు. శనివారం సాయంత్రానికి రాజీకి అవకాశమున్న 2,22,770 కేసులను ఇరువర్గాల మధ్య సామరస్యపూర్వకంగా పరిష్కరించారు.

హైకోర్టు ప్రాంగణంలో ఏపీ హైకోర్టు న్యాయసేవల కమిటీ ఆధ్వర్యంలో మొత్తం నాలుగు లోక్ అదాలత్ బెంచ్‌లను నిర్వహించారు. జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి, జస్టిస్ కుంచం మహేశ్వరరావు, జస్టిస్ ఆలపాటి గిరిధర్, జస్టిస్ చింతలపూడి పురుషోత్తంకుమార్‌లు ఆయా బెంచ్‌లకు అధ్యక్షత వహించారు. 76 కేసులను పరిష్కరించారు. రూ. 1.26 కోట్ల పరిహారం అందజేసేందుకు అవార్డులు జారీచేశారు. అలాగే విశాఖపట్నంలోని రుణ వసూళ్ల ట్రైబ్యునల్(డీఆర్టీ) బెంచ్‌లో 13 కేసులను పరిష్కరించి రూ. 46.11 కోట్ల పరిహార చెల్లింపునకు అవార్డులు జారీచేశారు.

**సామరస్యపూర్వకంగా పరిష్కరించడం :** ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని గురజాల కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 43 ఏళ్లనాటి 71.51 ఎకరాల భూసేకరణకు సంబంధించిన అప్పీళ్లను సామరస్యపూర్వకంగా పరిష్కరించడం విశేషం. సుదీర్ఘ కాలం కొనసాగిన భూసేకరణ వివాదానికి పరస్పర అంగీకారంతో తెరపడింది. దీంతో భూములిచ్చిన రైతులకు ఉపశమనం లభించింది. మాచర్ల మండలం, కొత్తపల్లి గ్రామంలో 400/220 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు కోసం 1983లో 71.51 ఎకరాలు సేకరించారు.

## పిడుగుపాటుతో నలుగురు మృతిపై సీఎం చంద్రబాబు విచారం

**అమరావతి, సెప్టెంబర్ 13 :** పిడుగుపాటుకు గురై పల్నాడు జిల్లాలో నలుగురు మృతి చెందడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు. నరసరావుపేట మండలం పెట్లూరివారిపాలెం, మోపిరివారిపాలెం, కాకాని శివారు లక్ష్మీపురం, పాలపాడు గ్రామాలకు చెందిన తలపనేని నాగమ్మ, మజ్జిగ చిన్న కోటేశ్వరరావు, మేకల వెంకాయమ్మ, దేరంగుల వెంకటయ్య అనే నలుగురు పిడుగులు పడి మృతిచెందడం బాధాకరమన్నారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించిన సీఎం... బాధిత కుటుంబాలకు తన ప్రగాఢసానుభూతి ప్రకటించారు. పండుగపూట నాలుగు కుటుంబాల్లో విషాదం నెలకొనడం బాధాకరమని అన్నారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## డిసెంబర్ 2027 నాటికి నాగ్‌పూర్-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే పూర్తి..



**నల్గొండ, సెప్టెంబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** నల్గొండ తెలంగాణ మీదుగా సుమారు 280 కిలోమీటర్ల మేర నిర్మాణం కానున్న అత్యంత కీలకమైన నాగ్‌పూర్--విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే భూసేకరణ ప్రక్రియ దాదాపు పూర్తయింది. ఈ ప్రతిష్టాత్మక హైవే మంచిర్యాల, వరంగల్, ఖమ్మం మీదుగా సాగనుంది. భూసేకరణలో మిగిలి ఉన్న చిన్నచిన్న సమస్యలను కూడా త్వరితగతిన పరిష్కరించి, NHAIతో సమన్వయం చేసుకుంటూ డిసెంబర్ 2027 నాటికి ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవే పూర్తయితే తెలంగాణతో పాటు మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ మధ్య రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడి, ప్రయాణ సమయం తగ్గడంతో పాటు ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధికి కూడా ఊతం లభించనుంది.

గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా

## బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్ ఎన్నిక

- నియామక పత్రం అందజేసిన గౌడ సంఘం జాతీయాధ్యక్షుడు గట్టు రామచంద్రయ్య గౌడ్



**ఆత్మకూరు (ఎం), సెప్టెంబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్ నియమితులయ్యారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో జాతీయ అధ్యక్షుడు గట్టు రామచంద్రయ్య గౌడ్ ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీసు ధనలక్ష్మి గౌడ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా నియమించిన గట్టు రామచంద్రయ్య గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో గౌడ మహిళల సంక్షేమం, అభివృద్ధి కి కృషి చేస్తానని మరియు అన్ని రంగాల్లో మహిళలు ముందుకు వచ్చేలా సమన్వయంతో పనిచేస్తా నని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుండాల మల్లేష్ గౌడ్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మొల్కపురి శ్రీకాంత్ గౌడ్, ఆత్మకూర్(ఎం) మండల మహిళా విభాగం అధ్యక్షురాలు పొన్నగాని జయశ్రీ జహంగీర్ గౌడ్ పాల్గొన్నారు.

## డీజే వద్దు-బాజా ముద్దు...

- గణేష్ నవరాత్రుల్లో డీజేలకు అనుమతి లేదు.
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు.
- భువనగిరి పట్టణ సర్కిల్ ఇన్ స్పెక్టర్ ఏం.రమేష్.




**యాదాద్రి భువనగిరి సెప్టెంబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో డీజే సౌండ్ సిస్టమ్‌ల వినియోగానికి ఎలాంటి అనుమతి లేదని భువనగిరి పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం. రమేష్ స్పష్టం చేశారు. ఉత్స వాలను ప్రశాంత వాతా వరణంలో నిర్వ హించేందుకు పోలీసుల సూచనలు , నిబంధ నలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని కోరారు. భువన గిరి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో డీజే ఆపరేటర్లు , యజ మానులతో శనివారం రోజు పోలీసులు ప్రత్యేక సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ గణేష్ మండపాల వద్ద సాధారణ సౌండ్ సిస్టమ్‌ను మాత్రమే వినియోగించాలని సూచించారు. మైక్ సిస్టమ్‌ను రాత్రి పది గంటల వరకు మాత్రమే ఉపయోగించాలన్నారు. పోలీసులఆదేశాలను ఉల్లం ఘించి డీజేలను వినియోగిస్తే సంబంధిత డీజే ఆపరేటర్లు , యజమానులు , మండప నిర్వాహకుల పై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనల ఉల్లంఘనకు అవకా శం లేకుండా ముందస్తు చర్యల్లో భాగంగా డీజే ఆపరేటర్లు , యజ మానులను బైండోవర్ చేసినట్లు తెలిపారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను అత్యంత భక్తి శ్రద్ధలతో , ఆనందోత్సాహాలతో నిర్వహిం చాలని , అదే సమయంలో పోలీసుశాఖ సూచించిన నిబంధనలను పాటించి సహకరించాలని ఇన్‌స్పెక్టర్ కోరారు. డీజేకు దూరంగా ఉండి..బాజాతో భక్తి భావాన్ని చాటు కుందామని , ప్రశాంత వాతావరణంలో గణ నాథుని ఉత్సవాలను నిర్వహిద్దాం అని ఆయన పిలుపునిచ్చారు.

## సౌర లైట్ ట్రాప్‌తో కీటకాల నియంత్రణ పై అవగాహన



**గరిడేపల్లి , సెప్టెంబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** పంటలను ఆశించే రాత్రిచర కీటకాలను గుర్తించి, వాటి ఉధృతిని అంచనా వేయడంలో సౌర విద్యుత్ లైట్ ట్రాప్ ఎంతో ఉపయోగపడుతుందని వ్యవసాయ విద్యార్థులు తెలిపారు. గడ్డిపల్లి కేవీకే ఆధ్వర్యంలో సి. హెచ్. ఎస్. డి. ఎస్. టి. థెరిస్సా కాలేజ్ ఫర్ ఉమెన్, ఏలూరుకు చెందిన వ్యవసాయ విద్యార్థులు రూరల్ అగ్రికల్చరల్ వర్క్ ఎక్స్‌పీరియన్స్ ప్రోగ్రామ్‌లో భాగంగా శనివారం గడ్డిపల్లి గ్రామ రైతులకు లైట్ ట్రాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. సౌర ఫలకం ద్వారా పగటిపూట సౌరశక్తిని విద్యుత్‌గా నిల్వ చేసి, రాత్రివేళ దీపాన్ని వెలిగించే విధంగా లైట్ ట్రాప్ పనిచేస్తుందని వివరించారు. వెలుతురుకు ఆకర్షితమయ్యే కాండం తొలిచే పురుగులు, ఆకులు తినే పురుగులు తదితర రాత్రిచర కీటకాలు ట్రాప్‌కు చేరుతాయని తెలిపారు. కీటకాల ఉధృతిని ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా అవసరమైన సమయంలో మాత్రమే సస్యరక్షణ చర్యలు చేపట్టవచ్చని సూచించారు. దీంతో అనవసరమైన పురుగుమందుల వినియోగాన్ని తగ్గించడంతో పాటు సాగు ఖర్చులు తగ్గుతాయని, పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని పేర్కొన్నారు. సమగ్ర సస్యరక్షణ (ఐపీఎం)లో లైట్ ట్రాప్‌ను సమర్థవంతంగా వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విద్యార్థులు జాన్ హెలీనా, గౌతమి, దీప్తి, సుమ, దేవి ప్రియా, భావన, కేవీకే శాస్త్రవేత్తలు, రైతులు నాగరాజు, నాగయ్య, రామనారయ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్లో ఉన్న కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలి..



**మిర్యాలగూడ సెప్టెంబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న కేసులను ఇరువర్గాలు రాజీ చేసుకుని లోక్ అదాలత్ పరిష్కరించుకోవాలని ఐదో అదనపు డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కెవి. చంద్రశేఖరరావు కోరారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ ఆయన ప్రారంభించి మాట్లాడుతూ సత్వర న్యాయం కోసం లోక్ అదాలత్ ను ఆశ్రాయించాలని కోరారు. కక్షిదారులు, ఫిర్యాధిలు పరస్పర అవగాహన, రాజీ పడి కేసులను పరిష్కరించుకోవాలని ఆయన కోరారు. చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహనా కలిగి ఉండాలన్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు ఐదు కోర్టులలో జరిగిన అదాలత్ లో సుమారు 573 కేసులు పరిష్కరించారు. అదేవిధంగా బ్యాంకులు, భీమా కంపెనీలు ఫిర్యాదిలకు 86,11,500రూపాయలు పరిహారం చెల్లించేలా పరిష్కారం చేశారు. వేములపల్లికి చెందిన వసంత అనే మహిళా తన భర్త రోడ్డు ప్రమాదంలో చనిపోగా భీమా కంపెనీపై రూ. 20లక్షలు చెల్లించాలని కేసు వేయగా కంపెనీ రాజీకి వచ్చి రూ. 16.50లక్షలు చెల్లించేందుకు లోక్ అదాలత్ లో రాజీకి వచ్చింది. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఎం. అర్జున్, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం. లావణ్యరాణి, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి. అరుణ్ తేజ్, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జంగిలి ఎల్లయ్య ఉపాధ్యక్షుడు ఈసరం కరుణాకర్, సంయుక్త కార్యదర్శి రాయారపు భాస్కర్ పాల్గొన్నారు.

# రాజీ మార్గం .. రాజ మార్గం

- సత్వర న్యాయం అందించడమే లోక్ అదాలత్ లక్ష్యం.
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాకరాజు శ్రీనివాసరావు..

**వనపర్తి, సెప్టెంబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** రాజీమార్గమే రాజమార్గమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాకరాజు శ్రీనివాసరావు అన్నారు.

శనివారం వనపర్తి పట్టణంలోని జిల్లా ప్రధాన న్యాయస్థానం ఆవరణంలో జిల్లా న్యాయ సేవల విభాగం ఆధ్వర్యంలో 3 వ, జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. వనపర్తి జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాకరాజు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాతీయ లోక్ అదాలత్‌లో వివిధ రకాల కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాకరాజు శ్రీనివాసరావు మాట్లాడుతూ "రాజీ మార్గమే రాజమార్గం" అని పేర్కొన్నారు. లోక్ అదాలత్ ద్వారా అనేక కేసులను ఇరుపక్షాల అంగీకారంతో సత్వరమే పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. రాజీ పద్ధతిలో కేసులను పరిష్కరించుకోవడం ద్వారా సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు ఇరుపక్షాలకు త్వరితగతిన న్యాయం లభిస్తుందని సూచించారు.

**సత్వర న్యాయం అందించడమే లోక్ అదాలత్ ప్రధాన లక్ష్యం..**

కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునేందుకు ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సత్వర న్యాయం అందించడమే లోక్ అదాలత్ లక్ష్యమని .. లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవడం ద్వారా తమ విలువైన సమయాన్ని ఆదా చేసుకోవచ్చని పేర్కొన్నారు.

వనపర్తి లో 3 వ, జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 6,617 కేసులు రాజీ అయ్యాయని తెలిపారు. ఇందులో 1,639 క్రిమినల్ కేసులు, 19 సివిల్ కేసులు, 4,959 ప్రీ - లిటిగేషన్ కేసులు పరిష్కారమయ్యాయనీ తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా ఇరుపక్షాల పరస్పర అంగీకారంతో కేసులను పరిష్కరించుకోవడం వల్ల న్యాయస్థానాల్లో పెండింగ్ కేసుల





సంఖ్య తగ్గడంతో పాటు ప్రజలకు సత్వర న్యాయం అందుతుందని న్యాయమూర్తి అన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోక్సో కోర్టు న్యాయమూర్తి, అదనపు జిల్లా జడ్జి కె. లావణ్య బాలరెడ్డి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి. కలర్చన, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె. కవిత, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి దీపా కాసరగడ్డ, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఛత్రగిరి నరసింహుడి సన్నిధిలో ఆధ్యాత్మిక వైభవం

- అమావాస్య వేళ పల్లకి సేవ, భజనలతో ఆధ్యాత్మిక శోభ..
- 3 వేల మందికి అన్నదానం

**కడ్తాల్ సెప్టెంబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** రంగారెడ్డి జిల్లాలో ప్రసిద్ధ పురాతన పుణ్య క్షేత్రం అయిన రావిరాల గ్రామంలో జొన్నాయిగూడ స్వయంభూ ఛత్రగిరి శ్రీశ్రీశ్రీ నరసింహ స్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా శుక్రవారం రాత్రి ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ప్రతి అమావాస్య రోజున ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతుండగా, ఈ నెల అమావాస్య సందర్భంగా కూడా ఆలయ నిర్వాహకులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచే ఆలయానికి భక్తుల రాక ప్రారంభమైంది. దూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వయంభూ నరసింహ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

**ప్రత్యేక పూజలు.. భక్తిశ్రద్ధలతో సేవలు**

ఆలయ ప్రధాన అర్చకులు మురళీకృష్ణ అజయ్ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అభిషేకాలు, అర్చనలు, హారతులు నిర్వహించి స్వామివారి ఆశీస్సులను భక్తులకు అందించారు. స్వామివారి సన్నిధిలో పూజలు నిర్వహించడంతో ఆలయ ప్రాంగణం మంత్రో చ్చారణలు, భక్తి గీతాలతో మార్మోగింది. అమావాస్య సందర్భంగా స్వామివారిని దర్శించుకుంటే కోరిన కోరికలు నెరవేరుతాయని, కుటుంబంలో సుఖశాంతులు నెలకొంటాయని భక్తుల విశ్వాసం. దీంతో ప్రతి అమావాస్యకు ఛత్రగిరి నరసింహ స్వామి ఆలయానికి భక్తుల సంఖ్య పెరుగుతోంది.

పల్లకి సేవతో ఆధ్యాత్మిక వైభవంప్రత్యేక పూజల అనంతరం నిర్వహించిన పల్లకి సేవ భక్తులను విశేషంగా



ఆకట్టుకుంది. స్వామివారి ఉత్సవమూర్తిని పల్లకిలో అధిష్ఠింపజేసి ఆలయ పరిసరాల్లో భక్తిశ్రద్ధలతో పల్లకి సేవ నిర్వహించారు. భక్తులు స్వామివారి నామస్మరణ చేస్తూ పల్లకి సేవలో పాల్గొన్నారు.

**భజనలతో మార్మోగిన ఆలయ ప్రాంగణం**

భజన మండలి సభ్యులు ప్రత్యేకంగా నిర్వహించిన భజనలు కార్యక్రమానికి మరింత ఆధ్యాత్మిక శోభను తీసుకొచ్చాయి. భక్తిగీతాలు, నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. భక్తులు సైతం భజనల్లో పాల్గొని స్వామివారి నామస్మరణ చేశారు. కొద్దిసేపు ఆలయ ప్రాంగణం మొత్తం భక్తి భావంతో నిండిపోయింది.

**3 వేల మంది భక్తులకు అన్నదానం**

అమావాస్య సందర్భంగా ఆలయంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సుమారు 3 వేల మంది భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. ఆలయానికి వచ్చిన ప్రతి భక్తుడికి అన్నప్రసాదం అందేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఈ అన్నదాన కార్యక్రమానికి సిరిగిరిపురం గ్రామానికి చెందిన అంబటి అనూష-మురళి మనోహర్ రెడ్డి దాతలుగా ముందుకు వచ్చి తమ వంతు సహకారం అందించారు. భక్తులకు అన్నప్రసాదం అందించడం ద్వారా వారు ఆధ్యాత్మిక సేవలో భాగస్వాములయ్యారు. అన్నదానానికి సహకరించిన దాతలకు ఆలయ కమిటీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు.



**భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి**

అమావాస్య సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు అవసరమైన ఏర్పాట్లు చేశారు. భక్తుల దర్శనం, పూజా కార్యక్రమాలు, పల్లకి సేవ, అన్నదానం సజావుగా జరిగేలా సమన్వయం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కాటగల రంజిత్ కుమార్ మాట్లాడుతూ.. ప్రతి అమావాస్య సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, పల్లకి సేవ, భజనలు, అన్నదానం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందుతున్నారని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు కమిటీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మురళీకృష్ణ, అజయ్, రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నర్సింహారెడ్డి, రంగారెడ్డి జిల్లా బీజేపీ నాయకులు కొంతం జంగారెడ్డి, కమిటీ సభ్యులు, భజన మండలి సభ్యులు, దాతలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అమావాస్య రోజున స్వామివారి దర్శనం.. ప్రత్యేక పూజలు.. పల్లకి సేవ.. భజనలతో పాటు వేలాది మంది భక్తులకు అన్నదానం నిర్వహించడం ద్వారా ఛత్రగిరి నరసింహ స్వామి ఆలయం భక్తి, సేవా కార్యక్రమాలకు వేదికగా నిలిచింది.

# గణేష్ మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

- డి.జలంధర్ రెడ్డి. ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మేడిపల్లి
- ఆన్‌లైన్‌లో మండపాల వివరాలు నమోదు చేసుకోవాలి
- ప్రజా రవాణాకు, అత్యవసర సేవలకు ఆటంకం కలగకుండా మండపాల ఏర్పాటు
- డీజేలు, మద్యం, జూదం, అసభ్య కార్యక్రమాలకు పూర్తిగా దూరంగా ఉండాలి
- మేడిపల్లి సీఐ డి.జలంధర్ రెడ్డి

**మేడిపల్లి, సెప్టెంబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖ సూచించిన నిబంధనలు, భద్రతా చర్యలను తప్పనిసరిగా పాటించాలని మేడిపల్లి సీఐ డి. జలంధర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ పలు విషయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా మేడిపల్లి సిఐ డి. జలంధర్ రెడ్డి మాట్లాడుతూ....

గణేష్ మండపాల నిర్వహణకు సంబంధించిన వివరాలను పోలీస్ శాఖ రూపొందించిన ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. గణేష్ మండపాల వివరాలను నమోదు చేసే విధానం కేవలం మండపాల నిర్వహణకు సంబంధించిన సమాచారం సేకరించడం, భద్రత, బందోబస్తు ఏర్పాట్లను సులభతరం చేయడం కోసమేనని, ఇందుకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని సీఐ స్పష్టం చేశారు. మండపాలు ఏర్పాటు చేసే ముందు నిర్వాహకులు ముందస్తుగా పోలీసులకు సమాచారం అందించడంతో పాటు ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.

"గణేష్ మండపం ఆన్‌లైన్ నమోదు పోర్టల్"
https://policeportal.tspolice.gov.in/userverifcn.htm ద్వారా వివరాలు నమోదు చేసి, సంబంధిత పోలీస్ స్టేషన్‌లో అప్లికేషన్‌ను అందజేయాలని తెలిపారు.

**భద్రతకు ప్రాధాన్యత**



మండపాలను ప్రజా రవాణాకు, అత్యవసర వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఏర్పాటు చేసుకోవాలని సీఐ సూచించారు. సంబంధిత శాఖల అనుమతులు, విద్యుత్ శాఖ అనుమతి పత్రాలతోనే విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలని తెలిపారు. ప్రతి మండపం వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు 24 గంటలూ నలుగురు వాలంటీర్లు అందుబాటులో ఉండేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని అన్నారు. మండపం వద్ద నిర్వాహక కమిటీ సభ్యుల వివరాలు, బాధ్యత వహించే వ్యక్తుల పేర్లు, ఫోన్ నంబర్లను ప్రదర్శించాలని సూచించారు. షెడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ షార్ట్ సర్క్యూట్‌కు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అగ్ని ప్రమాదాల నివారణకు ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, నీటి డ్రమ్ములు, ఇసుకను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు.

**డీజేలకు అనుమతి లేదు**

గణేష్ మండపాల్లో, శోభాయాత్రలో ఎట్టి పరిస్థితుల్లోనూ డీజేలు ఏర్పాటు చేయరాదని సీఐ స్పష్టం చేశారు. విద్యాసంస్థలు, ఆసుపత్రులు, ప్రార్థనా మందిరాలు, వృద్ధులు, చిన్నారులకు ఇబ్బంది కలగకుండా పోలీసుల అనుమతితో పరిమిత స్థాయిలో చిన్న స్పీకర్లను మాత్రమే వినియోగించాలని సూచించారు. మండపాల వద్ద భక్తి గీతాలనే వినిపించాలని, రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లను వినియోగించాలని తెలిపారు. మండపాల వద్ద మద్యం సేవించడం, జూదం ఆడటం, అసభ్యకర నృత్యాలు నిర్వహించడం, ఇతరుల మనోభావాలను కించపరిచే ప్రసంగాలు, పాటలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం పూర్తిగా నిషేధమని హెచ్చరించారు.

**శోభాయాత్రలో క్రమశిక్షణ పాటించాలి**

గణేష్ నిమజ్జన శోభాయాత్రను మధ్యాహ్నం నుంచే ప్రారంభించి, నిర్దేశిత సమయానికి నిమజ్జనం పూర్తయ్యేలా పోలీసులకు సహకరించాలని సీఐ కోరారు. ప్రతిష్ఠాపన, నిమజ్జనం రోజుల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలన్నారు. శోభాయాత్రలో ఇతరులపై రంగులు చల్లడం, కించపరిచే నినాదాలు చేయడం, టపాసులు పేల్చడం పూర్తిగా నిషేధమని తెలిపారు.

శోభాయాత్రకు వినియోగించే వాహనాలు మంచి కండిషన్‌లో ఉండాలని, డ్రైవర్‌కు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు ఉండాలని సూచించారు. మద్యం సేవించి శోభాయాత్రలో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే వెంటనే సమాచారం**

మండపాల వద్ద అనుమానాస్పద బ్యాగులు, వస్తువులు లేదా వ్యక్తులు కనిపించిన వెంటనే పోలీసులకు లేదా డయల్ 100కు సమాచారం అందించాలని సీఐ సూచించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మవద్దని, సందేహాలు ఉంటే పోలీసులను సంప్రదించాలని కోరారు. మహిళలు, చిన్నారుల భద్రతకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, మండపాలు, శోభాయాత్రలో వారికి ఇబ్బందులు కలిగించేలా ఎవరైనా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండపాల వద్ద పాయింట్ బుక్స్ ఏర్పాటు చేసుకోవాలని, ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో పోలీసులు చేసే తనిఖీలకు నిర్వాహకులు సహకరించాలని సూచించారు.

గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని మేడిపల్లి సీఐ డి. జలంధర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# నాన్-డెయిరీ పనీర్ పై ఏడాదిపాటు నిషేధం...

**యాదాద్రి భువనగిరి సెప్టెంబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా నాన్- డెయిరీ , కృత్రిమ , అనలాగ్ పనీర్ ఉత్పత్తుల తయారీ , ప్రాసెసింగ్ , ప్యాకింగ్ , నిల్వ , పంపిణీ , రవాణా , విక్రయాల పై ఏడాది పాటు నిషేధం విధించింది. ఈ నిషేధం 2026 సెప్టెంబర్ 10 నుంచి తక్షణమే అమల్లోకి వచ్చింది. తెలంగాణ ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఈ మేరకు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్--2006లోని సెక్షన్ 30 (2) (ఏ) కింద ఉత్తర్వులు జారీ చేశారు. దీనికి సంబంధించి సెప్టెంబర్ 10న గెజిట్ నోటిఫికేషన్ నంబర్ 807 విడుదలైంది.

అసలు పనీర్‌కు బదులుగా నాన్-డెయిరీ పదార్థాలు పాల కొవ్వు లేదా పాల ఘన పదార్థాలను పూర్తిగా లేదా కొంతవరకు వెజి టబుల్ ఆయిల్ , వెజి టబుల్ ఫ్యాట్ , స్టార్చ్ వంటి నాన్-డెయిరీ పదార్థాలతో భర్తీ చేసి తయారు చేసే ఉత్పత్తులను అనలాగ్ పనీర్‌గా పరిగణిస్తారు. వీటిని పనీర్‌గా పేర్కొంటూ విక్రయించడం కూడా నిషేధ పరిధిలోకి వస్తుంది.

నిబంధనలు ఉల్లంఘించి ఇలాంటి ఉత్పత్తులను తయారు చేసినా , నిల్వ చేసినా , రవాణా చేసినా లేదా విక్రయించినా ఫుడ్ సేఫ్టీ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. అయితే చట్ట బద్ధంగా నిర్దేశిత ప్రమాణాలకు అను



గుణంగా తయారయ్యే స్టాండర్డైజ్డ్ ఆహార ఉత్పత్తులకు ఈ నిషేధం వర్తించదని పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో వినియోగ దారులకు నాణ్యమైన , సురక్షితమైన పాల ఉత్పత్తులు అందేలా చర్యలు మరింత కఠినతరం కానున్నాయి.

# మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ విస్తృత స్థాయి సమావేశం

- ముఖ్య అతిథిగా సిడబ్ల్యూసి సభ్యులు చల్లా వంశీ చంద్ రెడ్డి.
- కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలి డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్



దేవరకద్ర, సెప్టెంబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) : మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ విస్తృత స్థాయి సమావేశం శనివారం జడ్చర్లలోని చంద్ర గార్డెన్స్‌లో డీసీసీ అధ్యక్షులు ఎ. సంజీవ్ ముదిరాజ్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి సిడబ్ల్యూసి సభ్యులు చల్లా వంశీ చందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పార్టీ సంస్థాగత నిర్మాణం, క్షేత్రస్థాయి పార్టీ కార్యక్రమాలు, రాబోయే రాజకీయ కార్యాచరణపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో మహబూబ్‌నగర్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలమైన, ఐక్యమైన, క్రమశిక్షణతో కూడిన ప్రజా సంస్థగా తీర్చిదిద్దేందుకు చేపట్టాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. సంస్థాగత బలోపేతమే లక్ష్యం అన్నారు. పార్టీ సంస్థాగత బలోపేతంలో భాగంగా మండల, గ్రామ, బూత్ స్థాయిల్లో కమిటీలను మరింత క్రియాశీలం చేయడం, ప్రతి గ్రామంలో ప్రజలతో నేరుగా మమేకమవడం, ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం నిరంతరం పోరాడడం, డీఎం డీసీసీ మరియు అసెంబ్లీ స్థాయి కమిటీల మధ్య సమన్వయాన్ని మరింత పటిష్టం చేయడం వంటి అంశాలపై చర్చించారు. అలాగే రాబోయే పార్టీ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని నిర్ణయించారు. డీసీసీ అధ్యక్షులు ఎ. సంజీవ్ ముదిరాజ్ గారు మాట్లాడుతూ, మహబూబ్‌నగర్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి బలమైన కార్యకర్తల బలం ఉందని, ఆ బలాన్ని మరింత సమర్థవంతంగా ప్రజా ఉద్యమాలుగా మలచాల్సిన అవసరం ఉందని అన్నారు. గ్రామస్థాయి నుంచి బూత్ స్థాయి వరకు పార్టీని బలోపేతం చేయడమే మన ప్రధాన లక్ష్యం. ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త ప్రజల మధ్య నిరంతరం ఉండాలి. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముందుండాలి" అని అన్నారు. పార్టీలో ఐక్యత, క్రమశిక్షణ, సమన్వయం ఉంటే మహబూబ్‌నగర్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మరింత శక్తివంతమైన రాజకీయ శక్తిగా ఎదుగుతుందని సంజీవ్ ముదిరాజ్ పేర్కొన్నారు. సిడబ్ల్యూసి సభ్యులు చల్లా వంశీ చందర్ రెడ్డి గారు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేసి, ప్రతి కార్యకర్తను పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలని సూచించారు. నాయకులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ పార్టీని ప్రజలకు మరింత చేరువ చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ చేపట్టే కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు జిల్లా నుంచి గ్రామస్థాయి వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని అన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదులా కొత్వాల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్ రెడ్డి, TPCC అధికార ప్రతినిధి జహీర్ అక్తర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, మధుసూదన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహా రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రబ్బానీ, ఎన్.పీ. వెంకటేష్, అశోక్ యాదవ్, జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ అల్వాల్ రెడ్డి, స్పోక్స్‌పర్సన్ నిత్యానంద్, డీసీసీ కమిటీ నాయకులు, మండల అధ్యక్షులు, వివిధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు సమాజానికి దిక్సూచీలు

- ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రధానం
- నల్గొండ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమాదేవి





కొత్తగూడెం, సెప్టెంబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) : ఉపాధ్యాయులు సమాజానికి దిక్సూచీ లాంటి వారని, వారి దిశా నిర్దేశంలో విద్యార్థులు తమ ప్రతిభకు పదును పెట్టి ఉన్నతులుగా ఎదుగు తారని నల్గండ జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.రమాదేవి అన్నారు. యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు జెబి.బాలు ఆధ్వర్యంలో జిల్లాలో ఉత్తమ ఉపాధ్యా యులను గుర్తించి వారికి అవార్డులు ప్రధానం చేశారు. జిల్లా కేంద్రమైన పట్టణంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్లో శనివారం జరిగిన కార్యక్రమంలో జిల్లాలోని 24మంది ఉత్తమ ఉపాధ్యాయులకు డిప్యూటీ కలెక్టర్, భద్రాచలం మోటరు వెహికల్ ఇన్‌స్పెక్టర్, టీజీఓ జిల్లా అధ్యక్షులు సంగం వెంకట పుల్లయ్య చేతులమీదుగా అవార్డులు అందచేసి సత్కరించారు. ఈసందర్భంగా రమాదేవి మాట్లాడుతూ పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధించే అంశాలు భవిష్యత్తుకు భరోసా కల్పిస్తాయన్నారు. ప్రతీ విద్యార్థి ఉపాధ్యాయులకు ముఖ్యమేనని తెలిపారు. ఎంతోమంది ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ బాల్యంలో ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యాభ్యాసం చేశారని గుర్తు చేశారు. ఎంవీఐ సంగం వెంకటపుల్లయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని, పాఠశాలలు దేవాలయాలు అయితేఅందులో ఉపాధ్యాయులు దేవుళ్లతో సమానమన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిపై మరింత బాధ్యత పెరుగుతుందన్నారు. జిల్లా ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ రంగాప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యా యులంటే సమాజంలో ప్రత్యేక స్థాణం ఉందన్నారు. ప్రతీ ఉపాధ్యాయుడు తమ తరగతిగదిలోని ప్రతి విద్యార్థికి విలువలతో కూడిన విద్యను అందిస్తారన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఎం.రమ, బి.బాలాజీ, వి.రాజశ్రీనివాసరావు, సోయం కృష్ణ, ఎన్.శ్రీనివాస్, టి.వనజ, సాబీర్‌పాషా, వివి.కోటేశ్వరరావు, బి.రమేష్‌రాథోడ్, బి.బాబురావు, రూపావినయ్, శ్రీరాములు, మోహన్‌లాల్, సుధశ్రీ, రాజయ్య, దస్రు, బి.రాము, నాగజ్యోతి, ఎన్.కిరణ్‌కుమార్, సుజాత, రాజశేఖర్, ఎస్‌కె.నజియా, పుష్పలత, కె.నాగమణిలకు అవార్డులు అందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ జిల్లాగౌరవాధ్యక్షులు బి.వీరునాయక్, ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు సాయికృష్ణ, డాక్టర్ ప్రవీణ్‌రెడ్డి, రత్నాకర్, హనుమాన్, జిమ్ కమలాకర్,జుబ్బు, మొక్కల బాలు, రాజేష్, రంగ, సుభాని, జయశ్రీ,వరప్రసాద్, బాలకృష్ణ, నాగకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలి

- బీజేపీ మండల అధ్యక్షుడు కుక్కడపు వెంకటేశ్వర్లు..



గరిడేపల్లి, సెప్టెంబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) : రాబోయే ఎన్నికల నాటికి పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు కుక్కడపు వెంకటేశ్వర్లు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇతర రాజకీయ పార్టీలు బిజెపి పై చేస్తున్న దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పి కొట్టాలని అన్నారు. మండలంలోని ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించడంతోపాటు పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, కిసాన్, మైనార్టీ, మహిళా మోర్చా, బీజేవైఎం తదితర మోర్చాల అధ్యక్షులను ఎన్నుకున్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని ప్రతి గ్రామంలో బీజేపీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రాయినిగూడెంలో బీజేపీ జెండా ధ్వంసం ఘటనపై ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్‌తో చర్చించి కేసు పురోగతిని తెలుసుకున్నారు. రెండు, మూడు రోజుల్లో పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎస్ఐ తెలిపినట్లు నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎడవల్లి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు జనిగల శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ అనంతు గురువయ్యగౌడ్, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి చిత్తలూరి సోమయ్యగౌడ్, సుందరి రమేష్, కాంపాటి రాజు, షేక్ మీరా, నర్సింగ్ నాగసైదులు, రావుల ఆంజనేయులుగౌడ్, నర్సింగ్ వినయ్, బొల్లేపల్లి శ్రీనివాస్‌గౌడ్, గుగులోతు రాజు, అశోక్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీతారాం ఏచూరి జీవితం త్యాగాలమయం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రంగారెడ్డి



మిర్యాలగూడ సెప్టెంబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) : మానవ జాతి బానిసత్వం నుండి పెట్టుబడిదారీ కబంధహస్తాల నుండి విముక్తి చెందాలని అందుకు మార్క్సిజమే దోహదకారి అని నమ్మిన ప్రపంచ మేధావి సీతారాం ఏచూరి జీవితం త్యాగాలమయమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో సీతారాం ఏచూరి రెండవ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోషలిజమే మానవాళి విముక్తికి దోహదకారని కారల్ మార్క్స్ చెప్పిన సిద్ధాంతాన్ని పునికి పుచ్చుకున్న ప్రపంచం మెచ్చిన కమ్యూనిస్టు మేధావి ఎచూరి అని అన్నారు. దేశంలో మతోన్మాద శక్తులు పెరగకుండా లౌకిక తత్వానికి హాని కలగకుండా పోరాటాలకు ఆయన రూపకల్పన చేశారన్నారు. పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికై ప్రజావాణిని వినిపించిన గొప్ప నాయకుడన్నారు. నేటి పాలకులు ఆయన రూపొందించిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలను ఎండగట్టాలన్నారు. కమ్యూనిస్టు పార్టీ నుండి దేశ ప్రతినిధిగా అనేక అంతర్జాతీయ సెమినార్లలో పాల్గొని కమ్యూనిజం విశిష్టతను ప్రపంచానికి చాటాడన్నారు. పార్లమెంట్లో ఏ చూరి ఉండాలని అందుకు తమ పార్టీ నుండి ఎన్నిక చేస్తావని కాంగ్రెస్ అధిష్టానం చెప్పినప్పటికీ దాన్ని తృణప్రాయంగా భావించి వదిలివేసిన మహావ్యక్తి అని ఆయన వివరించారు. వర్తమాన పరిస్థితులను ఆకలింపు చేసుకొని వాటికి తగ్గట్టుగా ఉద్యమాలు చేపట్టడం జరిగిందని ఆయన బాటలో కార్యకర్తలు నడవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వీరేపల్లివెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యులు రాగిరెడ్డి మంగారెడ్డి, ఎం.రవినాయక్ పట్టణ కార్యదర్శి మల్లు గౌతంరెడ్డి భావండ్ల పాండు, సిఐటియు తిరుపతి రామ్మూర్తి, సిపిఎం నాయకులు జీవీ.రెడ్డి, రమేష్, రామకృష్ణ, టూప్రా నాయకులు కేశవులు, రెడ్డి ల్యాబ్ సిఐటియు నాయకులు శ్రీనివాసరావు, వేణు, బుడిగ రాములు పాల్గొన్నారు.

## సాంకేతిక ఆవిష్కరణలకు వేదిక శ్రీ చైతన్య:చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్

- విద్యార్థుల్లో ప్రతిభ వెలికితీసేందుకు స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-2026



పాలేరు, సెప్టెంబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) : విద్యార్థుల ఆలోచన శక్తిని సాంకేతిక ఆవిష్కరణలుగా మలుస్తూ,దేశంలోని వాస్తవ సమస్యలకు వినూత్న పరిష్కారాలను అన్వేషించే స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-2026 కార్యక్రమం ద్వారా యువతలోని ప్రతిభను వెలికితీసి,భవిష్యత్ ఆవిష్కర్తలుగా తీర్చిదిద్దే అవకాశం లభిస్తోందని శ్రీ చైతన్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ రీసెర్చ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాయి గీతిక అన్నారు. ఖమ్మం రూరల్ మండలంలోని పొన్నేకల్ శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్--2026 పోటీలకి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటికి సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కారాలను రూపొందించడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచన, పరిశోధనా దృక్పథం, సమస్య పరిష్కార సామర్థ్యం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని చెప్పారు. కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కరించేందుకు స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ గొప్ప వేదికగా నిలుస్తోందన్నారు. కళాశాలలో నిర్వహించిన అంతర్గత పోటీలకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించిందని తెలిపారు. మొత్తం 78 జట్లు పోటీల్లో పాల్గొనగా, ప్రతిభ ఆధారంగా 43 జట్లు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వెల్లడించారు. కళాశాల డీన్ డాక్టర్ వి.సుదర్శన్ మాట్లాడుతూ విద్యార్థులు ఆలోచన నుంచి ప్రోటోటైప్ వరకు వెళ్లే దిశగా భారత విద్యా మంత్రిత్వ శాఖ,ఏఐసిటీఈ, ఇన్స్టిట్యూషన్స్,ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ విద్యార్థులకు అనుభవాత్మక అభ్యాసానికి చక్కటి వేదికగా నిలుస్తుందని తెలిపారు. విద్యార్థులు బృందాలుగా ఏర్పడి సమస్యలను గుర్తించడం, అవసరమైన సమాచారాన్ని సేకరించడం, పరిశోధన చేయడం, పరిష్కారాలను రూపొందించడం,ప్రోటోటైప్ అభివృద్ధి, కోడింగ్, టెస్టింగ్ వంటి దశలను పూర్తి చేస్తూ తమ ఆలోచనలకు ఆచరణాత్మక రూపం ఇస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఏఓ వైశాలి,రీసెర్చ్ కోఆర్డినేటర్ డాక్టర్ మురళీ మోహన్,ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్,ప్రోగ్రాం కోఆర్డినేటర్ రాంబాబు,వివిధ విభాగాల అధిపతులు,అధ్యాపకులు, రీసెర్చ్ కోఆర్డినేటర్స్,మెంటర్లు,విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మిర్యాలగూడ లోక్ అదాలత్‌లో రోటరీ క్లబ్ సేవా కార్యక్రమం



మిర్యాలగూడ,సెప్టెంబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) : లోక్ అదాలత్‌కు హాజరైన కక్షిదారులకు సేవలందించే ఉద్దేశంతో రోటరీ క్లబ్ ఆఫ్ మిర్యాలగూడ ఆధ్వర్యంలో శనివారం స్థానిక కోర్టు ప్రాంగణంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు మాసెట్టి శ్రీనివాసు, మాగంటి శ్రీనివాసరావు నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు లోక్ అదాలత్‌కు హాజరైన కక్షిదారులకు న్యాయమూర్తులు కక్షిదారులకు పులిహోర ప్యాకెట్లు, వాటర్ ప్యాకెట్లను అందజేశారు. కక్షిదారులకు సేవ చేయాలనే ఉద్దేశంతో రోటరీ క్లబ్ చేపట్టడాన్ని న్యాయమూర్తులు క్లబ్ అధ్యక్షుడు, సభ్యులను ప్రత్యేకంగా ప్రశంసిం చారు. కార్యక్రమంలో 5వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి శ్రీ కెవి.చంద్రశేఖరరావు, సీనియర్ సివిల్ జడ్జి ఎం. అర్జున్, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం. లావణ్యారాణి, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి.అరుణ్ తేజ్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కరుణాకర్, ప్రధాన కార్యదర్శి జంగిలి ఎల్లయ్య, సంయుక్త కార్యదర్శి రాయారపు భాస్కర్, కోశాధికారి రెడ్డిపల్లి సైదులు, గ్రంథాలయ కార్యదర్శి కందిమళ్ల వెంకట్ రెడ్డి, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, పోలీసు సిబ్బంది, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌కు హాజరైన కక్షిదారులకు ఆహారం, తాగునీరు అందించడం ద్వారా రోటరీ క్లబ్ సభ్యులు మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. సేవా కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసు సిబ్బంది, రోటరీ క్లబ్ సభ్యులకు నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఎస్ఐఆర్ 2026 ప్రత్యేక ప్రచార దినోత్సవ కార్యక్రమాల పరిశీలన..

- పాల్గొన్న ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి జె.ఎల్.బి. హరిప్రియ.



దేవరకద్ర, సెప్టెంబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) : మహబూబ్‌నగర్ జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్, 75-జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి జె.ఎల్.బి. హరిప్రియ శనివారం జడ్చర్ల మండలంలోని గంగాపూర్, గొల్లపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎస్ఐఆర్ 2026లో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రచార దినోత్సవ కార్యక్రమాల సందర్భంగా గంగాపూర్ గ్రామంలోని పోలింగ్ కేంద్రాలు 208, 209, 210, 211, గొల్లపల్లి గ్రామంలోని పోలింగ్ కేంద్రాలు 121, 122, 123లను ఆమె సందర్శించి, అక్కడ జరుగుతున్న కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నోటీస్ హియరింగ్స్, డిస్క్రెపెన్సీస్, నో మ్యాపింగ్కు సంబంధించిన పత్రాలు, రికార్డులను పరిశీలించి, వాటి పరిష్కారానికి చేపడుతున్న చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక ప్రచార దినోత్సవంలో భాగంగా చేపడుతున్న కార్యకలాపాలను ఎన్నికల నిబంధనల ప్రకారం సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి లోపాలకు తావులేకుండా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఓటరుకు సంబంధించిన వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్చర్ల తహశీల్దార్, ఏఈఆర్‌ఓ నర్సింగరావు, డిప్యూటీ తహశీల్దార్ (ఎన్నికలు), జడ్చర్ల తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



దేవరకద్ర, సెప్టెంబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) : ఎస్ఐఆర్ 2026 ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రచార దినం సందర్భంగా కౌకుంట్ల, సి.సి.కుంట, దేవరకద్ర మండలాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పర్యటనలో భాగంగా కౌకుంట్ల మండలం పుట్టపల్లి గ్రామంలోని పోలింగ్ కేంద్రం నంబర్ 156, కౌకుంట్ల గ్రామంలోని పోలింగ్ కేంద్రాలు 157, 158, 159, 160లను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే సి.సి.కుంట గ్రామంలోని పోలింగ్ కేంద్రాలు 208, 209, 210, 211, 212, 213లను సందర్శించి, అక్కడ ఎస్ఐఆర్ 2026లో భాగంగా చేపడుతున్న ఎన్నికల సంబంధిత కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. అదేవిధంగా దేవరకద్ర మండలంలోని చిన్న రాజమూర్ గ్రామంలో ఉన్న పోలింగ్ కేంద్రాలు 133, 134లను సందర్శించి, SIR-2026 ప్రక్రియలో భాగంగా పోలింగ్ కేంద్రాల్లో చేపట్టిన ఏర్పాట్లు, ఓటర్లకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ మాట్లాడుతూ, పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను పక్కాగా కల్పించాలని అధికారులకు సూచించారు. ఎస్ఐఆర్ 2026 ప్రత్యేక ప్రచార దినాన్ని సమర్థవంతంగా నిర్వహించి, అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటర్ల జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి లోపాలకు తావులేకుండా క్షేత్రస్థాయిలో ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత తహసీల్దార్లు/ఏఈఆర్‌ఓలు, డిప్యూటీ తహసీల్దార్లు, బీఎల్‌ఓ సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

## అడ్డాకులకు రూ.40.40 కోట్ల అభివృద్ధి వరం

- రహదారులు, వంతెనల నిర్మాణానికి భారీగా నిధులు..
- ఇస్రంపల్లి వద్ద రెండు కీలక పనులకు నిధులు మంజూరు
- ఎమ్మెల్యే జీఎంఆర్‌కు కృతజ్ఞతలు తెలిపిన మండల కాంగ్రెస్ నాయకులు



దేవరకద్ర, సెప్టెంబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) : దేవరకద్ర నియోజకవర్గం,అడ్డాకుల మండలంలో రహదారులు, వంతెనల నిర్మాణానికి రూ.40.40 కోట్ల నిధులు మంజూరయ్యాయి. దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) చొరవతో ఈ నిధులు మంజూరైనట్లు మండల కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్‌హెచ్-44-పెద్దమునగల్‌చెడు-ఇస్రంపల్లి-కౌకుంట్ల రహదారి అభివృద్ధి, హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.35 కోట్లు, అలాగే రాచాల-కౌకుంట్ల రహదారిలో ఇస్రంపల్లి వద్ద వంతెన నిర్మాణానికి రూ.5.40 కోట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఈ పనులు పూర్తయితే మండలంలోని పలు గ్రామాలకు రాకపోకలు సులభతరం కానున్నాయి. ముఖ్యంగా రైతులు వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తరలించేందుకు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, వాహనదారులు ప్రయాణించేందుకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. వర్షాకాలంలో రాకపోకలకు ఎదురయ్యే ఇబ్బందులు తగ్గడంతో పాటు గ్రామాల మధ్య అనుసంధానం మరింత మెరుగుపడుతుందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. అడ్డాకుల మండల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ కీలక రహదారులు, వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడంలో చొరవ చూపిన ఎమ్మెల్యే జీఎంఆర్‌కు మండల కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అడ్డాకుల సర్పంచ్ దశరథ్ రెడ్డి,మండల అధ్యక్షుడు శ్రీహరి,జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు నాగిరెడ్డి,విజయమోహన్ రెడ్డి,షఫీ,రవీందర్ రెడ్డి,శేఖర్ రెడ్డి,పరుష రాములు,హన్మంతు దేవేందర్ రెడ్డి,తిరుపతయ్య,బుచ్చన్న,రాములు తదితరులు పాల్గొన్నారు.

## "రాజీమార్గమే - రాజమార్గం"

- సీనియర్ సివిల్ జడ్జ్...ప్రతీక్ సిహాగ్.



నర్సంపేట, సెప్టెంబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) : నర్సంపేటలో జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీనియర్ సివిల్ జడ్జ్, తాలూకా లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్ ప్రతీక్ సిహాగ్ మాట్లాడుతూ రాజీ మార్గమే రాజమార్గమని లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని,రాజీ పడదగిన కేసులలో ఇద్దరు రాజీ కుదుర్చుకున్నట్లయితే వెంటనే కేసుకు విముక్తి కలిగించి బాధితులకు సత్వర న్యాయం అందించడం జరుగుతుందని,రాజీ పడదగిన కేసులలో ఇరు పార్టీలు రాజీ కుదుర్చుకొని కేసుల భారాన్ని తగ్గించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ ఎండి యూసుఫ్ ,అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ గిరిధర్,బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సిలువేరు కిరణ్ కుమార్,లోక్ అదాలత్ మెంబర్స్ షేక్ రహీముద్దీన్,దొంతి సాంబయ్య,మోటూరి రవి,ఏ.జి.పి అంబటి రాజకుమార్,న్యాయవాదులు టి.సునీత,అంబాల సుధీర్,పండుగ శ్రీనివాస్, పాలడుగుల ప్రవీణ్,సీఐలు,ఎస్సైలు,బ్యాంకు సిబ్బంది,కక్షిదారులు,కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీసు సిబ్బందికి సీపీ ప్రశంసా పత్రాలు



కోహెడ, సెప్టెంబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) : కోహెడ మండల పరిధిలో వరుస దొంగతనాలు, ట్రాన్స్ ఫార్మర్ కాపర్ వైర్ చోరీలకు పాల్పడుతున్న నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందిని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ ఐపీఎస్ అభినందిం చారు. 'సీపీ కనెక్ట్' కార్యక్రమంలో భాగంగా శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో ప్రతిభ చూపిన సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు.

## మహావీర్ హరిణ వనస్థలి నేషనల్ పార్క్ లో వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం





**నాగోల్, సెప్టెంబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** నాగోల్ డివిజన్‌లోని మహావీర్ హరిణ వనస్థలి నేషనల్ పార్క్ లో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. నాగోల్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ గారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను ప్రోత్సహించడం ద్వారా పర్యావరణానికి హాని కలగకుండా గణేష్ నవరాత్రులను భక్తిశ్రద్ధలతో నిర్వహించాలనే సందేశాన్ని ప్రజలకు అందించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను ఉపయోగించి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతగా సహకరించాలని కోరారు. రసాయనాలతో తయారయ్యే విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితం కాకుండా ప్రతి ఒక్కరూ పర్యావరణహితమైన మట్టి విగ్రహాలనే వినియోగించాలని సూచించారు.

## రాజీ మార్గమే సరియైన మార్గం

- సీనియర్ సివిల్ జడ్జి అపర్ణ మల్లాది



**మంథని , సెప్టెంబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** మంథని కోర్టు ప్రాంగణం లో శనివారం జాతీయ లోక్ అదాలత్ లో సీనియర్ సివిల్ జడ్జి అపర్ణ మల్లాది మాట్లాడుతూ రాజీ మార్గమే సరియైన మార్గం అని,పరస్పర అంగీకారంతో కేసుల పరిష్కారం చేసుకొని సమయాన్ని ఆధా చేసు కోవాలని, దీని ద్వారా తీవ్ర మైన నేరాలకు సంబంధించిన కేసులు త్వరగా పరిష్కరించడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఆర సుధారాణి, ద్వితీయ శ్రేణి న్యాయ మూర్తి అనురాధ, ఏపీపీ అర్థ కుమార్, ఎజీపీ ఆంజనేయులు, సీనియర్ న్యాయవాదులు రగొత్తం రెడ్డి, సువర్ణ చంద్ర శేఖర్, కటకం శ్రీనివాస్, శశి భూషణ్ కాచే,అశోక్ రెడ్డి, వ్యాస్, మంథని ఎస్ ఐ సందీప్, బ్యాంక్ అధికారులు, కక్షి దారులు, పోలీసు సిబ్బంది, కోర్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ చైర్మన్‌గా నియమితులైన మధు యాష్కి గౌడ్ గారికి ఘన సన్మానం.



**గడ్డి అన్నారం , సెప్టెంబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** గడ్డి అన్నారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మద్దెల సునీల్ బాబు గారి ఆధ్వర్యంలో, ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ చైర్మన్‌గా నియమితులైన శ్రీ మధు యాష్కి గౌడ్ గారి నివాసానికి వెళ్లి, శాలువా మరియు గజ పూలమాలతో ఘనంగా సత్కరించి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.ప్రజా సేవలో, కాంగ్రెస్ పార్టీ బలోపేతంలో నిరంతరం ముందుండే మధు యాష్కి గౌడ్ గారికి దక్కిన ఈ గౌరవం మనందరికీ గర్వకారణం. వారు ఈ బాధ్యతలో మరింత విజయవంతంగా రాణించి, దేశవ్యాప్తంగా పార్టీకి మరింత సేవ చేయాలని ఆకాంక్షిస్తున్నాము.ఈ కార్యక్రమంలో గండి జగన్ యాదవ్, మద్దూరి శ్రీనివాస్, వై.వి. కృష్ణారెడ్డి, సాయి కుమార్ (డింపు) మహేష్ తదితరులు పాల్గొన్నారు.మద్దెల సునీల్ బాబు అధ్యక్షులు, గడ్డి అన్నారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ.సంబంధిత అంగన్వాడీ కేంద్రాల నోటీస్ బోర్డులలో అందుబాటులో ఉంటాయని తెలిపారు.

## ఘనంగా ప్రపంచ మార్క్సిస్టు మేధావి ఏచూరి రెండవ వర్ధంతి

- యాచారం సిపిఐఎం పార్టీ మండల కార్యదర్శి ఆలంపల్లి నరసింహ
- సిపిఐ ఎం జిల్లా కమిటీ సభ్యులు పి అంజయ్య.



**ఇబ్రహీంపట్నం , సెప్టెంబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** మాల్ కేంద్రంలో ప్రపంచ మేధావి ,సిపిఎం అగ్ర నేత, సిపిఎం జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, ఉత్తమ పార్లమెంట్ సభ్యుడు కామ్రేడ్ సీతారాం ఏచూరి 2వ వర్ధంతి సందర్భంగా సిపిఎం యాచారం మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా ఆయన చిత్రపటానికి,పూలమాలవేసి,నివాళులర్పించడం జరిగిందిఈ సందర్భంగా సిపిఎం పార్టీ యాచారం మండల కార్యదర్శి అలంపల్లి నరసింహ మాట్లాడుతూ,కామ్రేడ్ సీతారాం ఏచూరి ఉన్నతమైన కుటుంబంలో పుట్టి నిరంతరం పేద ప్రజల కోసం పోరాటం చేసిన వ్యక్తి అని అన్నారు.ఈ సీతారాం ఏచూరి జవహర్లాల్ నెహ్రూ యూనివర్సిటీలో విద్యార్థిగా చదువుతున్న సమయంలో ఇందిరాగాంధీ ఎమర్జెన్సీని విధించిన సమయంలో ఎవరూ ఆమెకు వ్యతిరేకంగా మాట్లాడని సమయంలో సీతారాం ఏచూరి ఆమెకు వ్యతిరేకంగా పోరాటం చేసి ఆమె వైఛాన్సలర్ పదవిని రాజీనామా చేపించిన గొప్ప వ్యక్తి సీతారాం ఏచూరి అని కొనియాడారు. అయినా జేఎన్యు అ అధ్యక్షుడిగా ఎన్నికై విద్యార్థుల సమస్యల మీద పోరాటం చేస్తూ అదే విధంగా దేశంలో ఉన్న విద్యార్థుల సమస్యల మీద ఎస్ఎఫ్ఐ ఆల్ ఇండియా అధ్యక్ష కార్యదర్శులు బాధ్యతలు కూడా నిర్వహించాడని గుర్తు చేశారు. అయినా బెంగాల్ నుండి రాజ్యసభకు ఎన్నికై రాజ్యసభలో ఆయన ప్రసంగాన్ని ప్రతిపక్ష సభ్యులు కూడా శ్రద్ధగా వినే వాళ్ళని అన్నారు. ఆయన రాజ్యసభ సభ్యుడు ఉన్నప్పుడే ఉత్తమ పార్లమెంట్ సభ్యుడుగా గుర్తు పొందారు అని అన్నారు. కేంద్రంలో ఉన్న మతోన్మాద బిజెపికి వ్యతిరేకంగా దేశంలో ఉన్న అన్ని లౌకిక రాజకీయ పార్టీలను ఏకం చేసి ఇండియా కూటమి ఏర్పాటు చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారని అన్నారు. కామ్రేడ్ సీతారాం ఏచూరి బ్రతికి ఉన్నప్పుడు నిరంతరం పేద ప్రజలకు హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తూ చనిపోయిన తర్వాత కూడా ఆయన మృతదేహాన్ని మెడికల్ పేద విద్యార్థుల పరిశోధన కోసం మృతదేహాన్ని దానం చేసిన గొప్ప వ్యక్తి అని గుర్తు చేశారు. ఆయన ప్రపంచ మేధావిగా గుర్తు పొందారని అన్నారు. ఆయనకు నివాళి అర్పించినట్టంటే కేంద్రంలో ఉన్న మతోన్మాద బీజేపీ పార్టీకి పోరాటం చెయ్యడమే నిజమైన అసలైన నివాళులు అర్పించడం అని అన్నారు. విద్యార్థులు, యువకులు , పేద ప్రజలు కామ్రేడ్ సీతారాం ఏచూరి స్ఫూర్తితో ఉద్యమం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి అంజయ్య, మండల కార్యదర్శి వర్గ సభ్యులు చందు నాయక్ ,ఆలంపల్లి జంగయ్య, మండల కమిటీ సభ్యులు పి వెంకటయ్య, కే తావు నాయక్, కే జగన్, విప్లవ కుమార్, శాఖ కార్యదర్శి బి సత్యనారాయణ , కుంటుర గిరి కాంత్, భూషణ్, నాయకులు సాయికుమార్, బీ జంగయ్య, రాములు, రమేష్, వెంకటేష్, శ్రీకాంత్, రాజు, నరసింహ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తింపు సంఘాల పదవీకాలం ముగిసింది

- ప్రతి యూనియనుకు సమాన హోదా కల్పించాలి
- అర్జీ త్రీ ఏపీఏ జీఎంలకు టీబీజీకేస్ వినతి





**మంథని , సెప్టెంబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** సింగరేణిలో గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలైన ఏఐటియుసి, ఐఎన్టీయూసీల పదవీకాలం ఈనెల 8వ తేదీన ముగిసినందున తిరిగి ఎన్నికలు నిర్వహించేంతవరకు సింగరేణిలోని అన్ని యూనియన్లకు కమిటీల నిర్వహణ మరియు ఇతర అంశాలలో సమాన అవకాశాలు కల్పించాలని కోరుతూ ఆర్ జి 3డివిజన్ జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్టు ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు గారికి తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు నాగెల్లి సాంబయ్య ఆధ్వర్యంలో నాయకులు వినతి పత్రం అందజేయడం జరిగింది. టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీ సూచన మేరకు అర్జీ త్రీ, ఏపీఏ సెంట్రల్ కమిటీ, డివిజన్ కమిటీ, పిట్ కమిటీల నాయకులు శనివారం సాయంత్రం జి ఎం కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగెల్లి సాంబయ్య గారు మాట్లాడుతూ2023 డిసెంబర్లోనే ఆర్ఎల్సి నేతృత్వంలో రెండు సంవత్సరాలకాల పరిమితితో ఎన్నికలు నిర్వహించడం జరిగిందని గెలుపొందిన సంఘాలు వివిధ కారణాల చేత 9 నెలలు ఆలస్యంగా గెలుపొందిన పత్రాన్ని సైతం రెండు సంవత్సరాల పరిమితితోనే తీసుకున్నారని వివరించారు. ఈ లెక్కన ఏఐటియుసి ,ఐఎన్టీయూసీ సంఘాలు రెండు సంవత్సరాల 9 నెలల పాటు కార్మికులకు ప్రాతినిధ్యం వహించాయని గుర్తు చేశారు.ఇట్టి విషయమై తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి గారు మరియు సింగరేణిలోని మరో రెండు యూనియన్లు సైతం ఆర్.ఎల్.సి మరియు సింగరేణి సి అండ్ ఎం డి మరియు డైరెక్టర్ పా గారికి వినతి పత్రం సైతం అందజేశారు. అంతేకాకుండా వెంటనే ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర హైకోర్టులో ఫీల్ దాఖలు చేయగా కేసు విచారణకు స్వీకరించారని ఈనెల 22న వాదనలు జరగనున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఈసంపల్లి రమేష్ సెంట్రల్ కమిటీ నాయకులు గట్టు శ్రీనివాస్ పాశం శ్రీనివాస్ రెడ్డి బోయినపల్లి శ్రీకాంతరావు, ఎల్ పి ఫిట్ సెక్రెటరీ వివి గౌడ్, సిహెచ్పి ఇన్చార్జ్ బుద్దే ఉదయ్,ఓసి టు అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరీ వీరగోని సంతోష్ గౌడ్ డివిజన్ కమిటీ నాయకులు అల్లంతి రుపతి దాసరి మల్లేష్ పూసాల శేఖర్, మాదాసి చంద్రయ్య,దద్దెడ చంద్రశేఖర్, దూల కంటి రాఘవరెడ్డి,కొప్పుల సురేష్, పెరిక రమేష్ ,టి వెంకటేష్ టి కుమార్, సుధాటి సుగుణాకర్ రావు, చింతపట్ల సతీష్ నీలం సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ వ్యాఖ్యలకు నిరసన: తుక్కుగూడలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ధర్నా.



**మహేశ్వరం , సెప్టెంబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ మున్సిపాలిటీలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు క్యారగారి శ్రీధర్ గారి ఆధ్వర్యంలో మొన్నటి రోజున శాసన సభాధిపతి స్పీకర్ గడ్డం ప్రసాద్ గారిపై బిఆర్ఎస్ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలపై నిరసనగా ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసన సభ్యుడు, మహేశ్వరం నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, మరియు మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు, టిపిసిసి సభ్యులు దేప భాస్కర్ రెడ్డి గార్లు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసిలు, మాజీ ఎంపిటీసీలు, సర్పంచులు, మాజీ సర్పంచులు, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, ఎస్సీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యా వ్యవస్థకు ప్రైవేటు టీచర్లు మూలస్తంభం



- ○ వికసిత్ భారత్ నిర్మాణానికి విద్యాభివృద్ధే కీలకం
- ○ ప్రైవేటు టీచర్లకు అవార్డుల ప్రదానోత్సవంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్):** విద్యా వ్యవస్థకు ప్రైవేటు టీచర్లకు మూల స్తంభంగా నిలుస్తున్నారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. ఆదివారం స్థానిక మెడికల్ కాలేజీలోని జింకానా ఆడిటోరియంలో హోప్ విన్ హాస్పిటల్స్ & గ్లోబల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో టీచర్స్ అవార్డ్స్ ప్రదానోత్సవానికి ఎమ్మెల్యే నసీర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుమారు వెయ్యి మంది టీచర్లకు ఉత్తమ అవార్డులు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఎంతో కీలకమైన ఉపాధ్యాయులను గుర్తించి, వారి సేవలను గౌరవిస్తూ ఈ వేడుకను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. దేశంలో సుమారు 40 లక్షల మంది ప్రైవేటు ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు ఆలోచనా విధానంలో భాగంగా వికసిత్ భారత్ నిర్మాణానికి విద్య ప్రధానమని తెలిపారు. ఎన్నో సవాళ్లు, ఆంక్షలు, పరిమిత వనరులు ఉన్నప్పటికీ విద్యార్థుల భవిష్యత్తే ధ్యేయంగా ప్రైవేటు విద్యార్థులు సేవలందిస్తారన్నారు. పుస్తకాలలోని పాఠాలు చెప్పడమే కాకుండా, జీవితంలో ఎలా గెలవాలో నేర్పించేది ఉపాధ్యాయులేనని చెప్పారు. హోప్ విన్ హాస్పిటల్స్ & గ్లోబల్ ఎడ్యుకేషన్ వారు ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు వృత్తినైపుణ్య వంటి అంశాలలో శిక్షణ అందించడమే కాకుండా అవార్డులు ప్రదానం చేయడం మంచి విషయమన్నారు.

## వినాయక చవితి సెలవు.. పీ.జీ.ఆర్.ఎస్ లేదు

**గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్):** వినాయక చవితి పండగ సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) సోమవారం నిర్వహించడం జరగదని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు ఈ అంశాన్ని గుర్తించి వ్యయ ప్రయాసలకు లోనై రావద్దని కోరారు.

## వీరబ్రహ్మేంద్ర స్వామి సన్నిధిలో వైభవంగా ముస్తాబైన వినాయకుని మందిరం



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్):** జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి సన్నిధిలోని ప్రధాన మాడ వీధిలో గత 30 సంవత్సరాలుగా వినాయక మండపం ఏర్పాటు చేస్తున్నారు ఆ మేరకు ఈ ఏడాది ఘనంగా కలకత్తా డెకరేషన్తో ముస్తాబైనట్లు అటు మండల ప్రజలకు ఇటు బ్రహ్మంగారి స్వామి దర్శనం వచ్చు భక్తులకు దర్శనం కలిగేలా కమిటీ సభ్యులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు.

## తెలంగాణలో లోక్ అదాలత్ సక్సెస్.. సైబర్ బాధితులకు రూ.42 కోట్ల వాపసు

**హైదరాబాద్, (జర్నలిస్ట్ ఫైల్):** తెలంగాణ వ్యాప్తంగా నిర్వహించిన మూడో జాతీయ లోక్ అదాలత్ విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో 3,896 సైబర్ మోసాల కేసులతో సహా మొత్తం 1.51 లక్షలకు పైగా రాజీపడదగిన (కాంపౌండబుల్) క్రిమినల్ కేసులను పరిష్కరించినట్లు తెలంగాణ పోలీస్ శాఖ ఆదివారం వెల్లడించింది. ఈ సెటిల్‌మెంట్ల ద్వారా సైబర్ నేరాల బాధితులకు ఏకంగా రూ. 42. 29 కోట్లు తిరిగి అందజేయడం గమనార్హం. రాష్ట్రవ్యాప్తంగా కోర్టులలో కేసుల భారాన్ని తగ్గించడంతో పాటు, కక్షిదారుల సమయం, డబ్బు ఆదా చేసే లక్ష్యంతో ఈ లోక్ అదాలత్ నిర్వహించారు. ఇరు పక్షాల మధ్య రాజీ, పరస్పర అంగీకారం ద్వారా వివిధ రకాల కేసులను పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం దోహదపడింది. ఈ అవకాశాన్ని ప్రజలు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని పోలీసులు ప్రోత్సహించారు. ఇందుకోసం పరిష్కారానికి అర్హత ఉన్న కేసులను గుర్తించి, ఇరువర్గాలకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. డీజీపీ కార్యాలయం విడుదల చేసిన ప్రకటన ప్రకారం, సెప్టెంబర్ 3న ప్రారంభమైన కేసుల పరిష్కార ప్రక్రియ సెప్టెంబర్ 12న ముగిసింది. ఈ సమయంలో మొత్తం 1,51,164 కేసులు పరిష్కారమయ్యాయి. వీటిలో 21,843 ఎఫ్ఐఆర్ కేసులు, 1,404 విపత్తు నిర్వహణ కేసులు, 61,052 పెట్టీ కేసులు, 62,969 మోటార్ వాహన చట్టం కేసులు ఉన్నాయి. ప్రత్యేకించి, 3,896 సైబర్ క్రైమ్ కేసుల పరిష్కారం ద్వారా బాధితులకు రూ. 42. 29 కోట్ల మొత్తాన్ని తిరిగి చెల్లించారు.

# వాటర్ మ్యాన్, అపరభగీరథుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు - ఎమ్మెల్యే గళ్ళా మాధవి

- ○ ప్రకాశం, రాయలసీమలను కోనసీమగా మార్చగల నాయకుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు
- ○ డోర్ టు డోర్ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పశ్చిమ టీడీపీ శ్రేణులకు వెలిగొండ - శ్రీశైలం పర్యటన
- ○ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో 10 బస్సుల్లో 450 మంది నాయకులు, కార్యకర్తల సందర్శన



**గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్):** ప్రకాశం, రాయలసీమలను కోనసీమగా మార్చగల నాయకుడు వాటర్ మ్యాన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, అపరభగీరథుడు నారా చంద్రబాబు నాయుడు అని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో నిర్వహించిన "ఇంటింటికి కూటమి ప్రభుత్వం - సంక్షేమ విజయాలు" డోర్ టు డోర్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రత్యేక ప్రోత్సాహకంగా వెలిగొండ ప్రాజెక్టు, శ్రీశైలం దేవస్థానం పర్యటనను ఏర్పాటు చేశారు. ఆదివారం శ్రీనివాసరావు పేటలోని క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే గళ్ళా మాధవి జెండా ఊపి 10 బస్సులను ప్రారంభించారు. ఈ పర్యటనలో సుమారు 450 మంది కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

పర్యటనలో భాగంగా వెలిగొండ ప్రాజెక్టును సందర్శించిన కార్యకర్తలు ప్రధాన టన్నెల్ ప్రాంతం, నీటి ప్రవాహ మార్గాలు, ఫీడర్ కాలువలు, 40 కిలోమీటర్ల ప్రధాన కాలువ వ్యవస్థతో పాటు ప్రాజెక్టు నిర్మాణ విశేషాలను పరిశీలించారు. కరువు ప్రాంతాలకు జీవనాడిగా మారిన ఈ ప్రాజెక్టు ద్వారా చేరుతున్న నీటి ప్రవాహాన్ని ప్రత్యక్షంగా వీక్షించి ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం శ్రీశైలం క్షేత్రంలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి దర్శనం చేసుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రూపొందించిన డోర్ టు డోర్ కార్యక్రమాన్ని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యకర్తలు అత్యంత బాధ్యతతో నిర్వహించారని తెలిపారు. కేవలం 20 రోజుల్లోనే కార్యక్రమాన్ని పూర్తి చేసి రాష్ట్రవ్యాప్తంగా 7వ స్థానంలో నిలవడం పశ్చిమ నియోజకవర్గ టీడీపీ శ్రేణుల నిబద్ధతకు నిదర్శనమని కొనియాడారు.

డోర్ టు డోర్ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కార్యకర్తలకు కృతజ్ఞతగా ఈ పర్యటన ఏర్పాటు చేశామని, అభివృద్ధి అంటే కేవలం మాటలు కాదని, ప్రజల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకొచ్చే మహత్తర ప్రాజెక్టులేనని పేర్కొన్నారు. అందుకే అమరావతి కాకుండా వెలిగొండ ప్రాజెక్టును సందర్శనకు ఎంపిక చేశామని తెలిపారు.

వెలిగొండ ప్రాజెక్టు అనేది కేవలం ఒక నీటిపారుదల ప్రాజెక్టు కాదని, అది చంద్రబాబు నాయుడు దూరదృష్టి, పట్టుదల, ప్రజల పట్ల ఉన్న అంకితభావానికి ప్రతీక అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. 1996లో శంకుస్థాపన జరిగిన ఈ ప్రాజెక్టు ఎన్నో అవరోధాలు ఎదుర్కొన్నప్పటికీ, చివరకు చంద్రబాబు నాయుడు నాయకత్వంలోనే ప్రజలకు అంకితం కావడం చారిత్రాత్మక ఘట్టమన్నారు. లక్షలాది మంది ప్రజలకు తాగునీరు, సాగునీరు అందించే ఈ ప్రాజెక్టు రాష్ట్ర అభివృద్ధి చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుందని తెలిపారు.

"వెలిగొండ అనేది ఒక సాధారణ ప్రాజెక్టు కాదు. ఇది మూడు దశాబ్దాల కల, వేలాది కుటుంబాల ఆశల ప్రతిరూపం. ఈ ప్రాజెక్టు వెనుక స్థానిక ప్రజల త్యాగం, ఇంజనీర్ల అంకితభావం, ప్రభుత్వ నిబద్ధత, ముఖ్యంగా చంద్రబాబు నాయుడు సంకల్పం ఉన్నాయి. అందుకే ప్రతి తెలుగు వ్యక్తి జీవితంలో ఒక్కసారైనా ఈ ప్రాజెక్టును సందర్శించాలి" అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు.

నదుల అనుసంధానం, జల సంరక్షణ, నీటి వనరుల సమర్థ వినియోగంలో చంద్రబాబు నాయుడు దూరదృష్టి కారణంగానే ఆయనకు "ఆంధ్రప్రదేశ్ వాటర్ మ్యాన్", "అపర భగీరథుడు" అనే గుర్తింపు వచ్చిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కావడంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఇంజనీర్లు, స్థానిక ప్రజలు, ముంపు గ్రామాల ప్రజలు అందించిన సహకారం మరువలేనిదని తెలిపారు.

ఈ పర్యటనలో పాల్గొన్న కార్యకర్తలు మాట్లాడుతూ, వెలిగొండ వంటి మహత్తర ప్రాజెక్టును ప్రత్యక్షంగా సందర్శించడం ద్వారా చంద్రబాబు నాయుడు అభివృద్ధి దృక్పథం ఎంత విస్తృతమైనదో అర్థమైందన్నారు. రాష్ట్ర భవిష్యత్తును మార్చగలిగే ప్రాజెక్టుల వెనుక ఉన్న కృషి, సంకల్పాన్ని తెలుసుకునే అవకాశం లభించిందని పేర్కొన్నారు.

ఈ పర్యటన తమలో మరింత ఉత్తేజాన్ని నింపిందని, పార్టీ బలోపేతం కోసం రెట్టింపు ఉత్సాహంతో పని చేస్తామని తెలిపారు.

# వైసీపీ శ్రేణుల క్షేమమే నా లక్ష్యం : ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి



**గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్):** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తన కుటుంబమని... అందులోని నేతలు, కార్యకర్తలంతా తన కుటుంబ సభ్యులని.. వారి క్షేమమే తన లక్ష్యమని.. శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి వ్యాఖ్యానించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడి తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న వైసీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరెడ్డి రవీంద్రారెడ్డిని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి పరామర్శించారు. ఆదివారం రెడ్డిపాలెంలోని బైరెడ్డి ఇంటికి వెళ్ళి ప్రమాదం జరిగిన వైనాన్ని ఆయన స్వయంగా అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు అన్ని విధాలా అండగా నిలవడమే తమ అజెండా అని స్పష్టం చేశారు. పార్టీ స్థాపించిన నాటి నుంచి తమ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ ఎలాగైతే పార్టీ నేతలు, కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారో... తాము కూడా ఆయన అడుగుజాడల్లో నడుస్తూ... దాన్నే తమ ప్రధాన కర్తవ్యంగా మలచుకున్నట్లు చెప్పారు. చాలా పార్టీలకు కేవలం ఎన్నికల సమయంలోనే పార్టీ శ్రేణులు గుర్తొస్తారని.. తమ పార్టీ అందుకు పూర్తి విరుద్ధమని.. ఆయన తెలిపారు. ఈ క్రమంలోనే వైయస్ జగన్ ఆదేశాల మేరకు తాము ఎప్పటికప్పుడు స్వయంగా వారి ఇళ్ళకు వెళ్ళి క్షేమ సమాచారాలు తెలుసుకోవడమే కాక వారికి అండగా నిలుస్తున్న విషయం అందరికి తెలిసిందేనని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బత్తుల దేవానంద్, పార్టీ నేతలు షేక్ రబ్బానీ, ఆవుల సుందరరెడ్డి, బోరుగడ్డ రజనీకాంత్, మంత్రి మహానంది, ఆలా కిరణ్, రెడ్డి కోటేశ్వరరావు, కౌండిన్య, సుందరరావు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

# గోవా వెళ్లి అశోక్ గజపతిరాజు ఆశీస్సులు అందుకున్న చిన్న శ్రీను



- ○ గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజుతో టీడీపీ నేత చిన్న శ్రీను భేటీ
- ○ కుమార్తె సిరి సహస్రతో కలిసి ఆశీస్సులు అందుకున్న వైనం
- ○ చంద్రబాబు, లోకేశ్, అశోక్ గజపతి రాజు సూచనలు పాటిస్తానన్న చిన్న శ్రీను
- ○ వైసీపీ నుంచి ఇటీవల టీడీపీలో చేరిన బొత్స మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు

**గోవా ,(జర్నలిస్ట్ ఫైల్):** ఇటీవల తెలుగుదేశం పార్టీలో చేరిన మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజుతో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. గోవాలో జరిగిన ఈ భేటీలో ఆయన కుమార్తె సిరి సహస్ర కూడా ఉన్నారు.

గోవాలోని గవర్నర్ నివాసంలో జరిగిన ఈ సమావేశంలో అశోక్ గజపతిరాజు.. చిన్న శ్రీనుకు, ఆయన కుమార్తెకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ ఎమ్మెల్యే అదితి గజపతిరాజు కూడా వారితో పాటు ఉండి, చిన్న శ్రీను కుటుంబానికి ఆతిథ్యం ఇచ్చారు.

సమావేశం అనంతరం చిన్న శ్రీను మాట్లాడుతూ.. టీడీపీ అధినేత చంద్రబాబు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ ఆదేశాలను, అలాగే అశోక్ గజపతిరాజు వంటి పెద్దల సూచనలను తాను తు.చ. తప్పకుండా పాటిస్తానని స్పష్టం చేశారు. కేవలం ఆయన ఆశీస్సులు, మార్గనిర్దేశం కోసమే ప్రత్యేకంగా కలిసినట్లు వివరించారు.

కాగా, వైసీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణకు మేనల్లుడైన చిన్న శ్రీను, ఇటీవల వైసీపీకి రాజీనామా చేసి తన కుమార్తె సిరి సహస్రతో కలిసి టీడీపీలో చేరిన విషయం తెలిసిందే. ఉండవల్లిలో చంద్రబాబు వారికి పార్టీ కండువా కప్పి టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో విజయనగరం జిల్లాకు చెందిన సీనియర్ నేత అశోక్ గజపతి రాజుతో చిన్న శ్రీను భేటీకి రాజకీయంగా ప్రాధాన్యం ఏర్పడింది.

## తిరుమలకు రోజుకు 15,000 వాహనాలేనా?

**తిరుమల(జర్నలిస్ట్ ఫైల్):** బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల ప్రైవేట్ వాహనాలపై ఆంక్షలు విధిస్తున్నట్లు సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తీవ్రంగా ఖండించింది. ఈ వార్తలు పూర్తిగా అవాస్తవమని, భక్తులు ఇలాంటి నిరాధారమైన వదంతులను నమ్మవద్దని స్పష్టం చేసింది.

కొంతకాలంగా సోషల్ మీడియా వేదికగా, "తిరుమలకు రోజుకు కేవలం 15,000 ప్రైవేట్ వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని, ఆ సంఖ్య దాటిన తర్వాత వచ్చే వాహనాలను అలిపిరి చెక్‌పాయింట్ వద్దే నిలిపివేస్తారు" అంటూ వార్తలు వ్యాప్తి చెందుతున్నాయి. ఈ ప్రచారం భక్తుల్లో తీవ్ర గందరగోళానికి, ఆందోళనకు కారణమైంది. ఈ నేపథ్యంలో టీటీడీ స్పందిస్తూ ఓ అధికారిక ప్రకటన విడుదల చేసింది. తిరుమలకు వచ్చే ప్రైవేట్ వాహనాల సంఖ్యపై ఎలాంటి పరిమితులు విధించే నిర్ణయం తీసుకోలేదని తేల్చిచెప్పింది. ప్రస్తుతం వాహనాల రాకపోకలపై ఎటువంటి కొత్త ఆంక్షలు అమలులో లేవని పునరుద్ఘాటించింది. టీటీడీకి సంబంధించిన ముఖ్యమైన నిర్ణయాలను, అధికారిక సమాచారాన్ని కేవలం టీటీడీ అధికారిక వెబ్‌సైట్, శ్రీ వెంకటేశ్వర భక్తి ఛానల్ (ఎస్వీబీసీ) ద్వారా మాత్రమే వెల్లడిస్తామని అధికారులు తెలిపారు. వాస్తవాలు నిర్ధారించుకోకుండా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసి భక్తులను అయోమయానికి గురిచేయడం సరికాదని హితవు పలికారు. టీటీడీ పేరుతో ఇలాంటి అసత్య ప్రచారాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఇండోనేషియాలో ఘోర నౌకా ప్రమాదం.. 130 మంది గల్లంతు

- ○ జావా సముద్రంలో మునిగిన ఇండోనేషియా ప్యాసింజర్ నౌక
- ○ ప్రమాదంలో 130 మంది గల్లంతు, 6గురు మృతి
- ○ 107 మందిని సురక్షితంగా కాపాడిన సహాయక బృందాలు
- ○ భారీ అలల కారణంగానే నౌక బోల్తా పడిందని వెల్లడి
- ○ గల్లంతైన వారి బంధువుల ఆందోళనతో పోర్టు వద్ద ఉద్రిక్తత




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** ఇండోనేషియాలో ఘోర నౌకా ప్రమాదం జరిగింది. 213 మంది ప్రయాణికులు, 30 మంది సిబ్బందితో కలిపి మొత్తం 243 మందితో ప్రయాణిస్తున్న 'వర్గో ట్రాన్స్‌పోర్ట్ 8' అనే నౌక జావా సముద్రంలో మునిగిపోయింది. ఈ పెను విషాదంలో ఇప్పటివరకు 107 మందిని సహాయక బృందాలు సురక్షితంగా కాపాడగా, ఆరుగురి మృతదేహాలను వెలికితీశాయి. మరో 130 మంది ఆచూకీ ఇంకా తెలియరాలేదు. వారి కోసం సముద్రంలో గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

వివరాల్లోకి వెళితే, తూర్పు జావాలోని సురబయ నుంచి శనివారం బయలుదేరిన ఈ నౌక, దక్షిణ కాలిమంటన్‌లోని బంజర్‌మాసిన్‌కు వెళుతోంది. ఆదివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో కెప్టెన్ నుంచి అధికారులకు చివరి సందేశం అందింది. సముద్రంలో దాదాపు 3 మీటర్ల ఎత్తున అలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయని, దీంతో నౌక ఒకవైపునకు ఒరిగిపోతోందని ఆయన తెలిపారు. ఆ తర్వాత కొద్దిసేపటికే నౌకతో సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. బంజర్‌మాసిన్ రేవుకు సుమారు 148 కిలోమీటర్ల దూరంలో ఈ దుర్ఘటన జరిగినట్లు అధికారులు నిర్ధారించారు.

సమాచారం అందుకున్న వెంటనే సహాయక చర్యలు ప్రారంభమయ్యాయి. నౌకాదళానికి చెందిన నౌకతో సహా నాలుగు నౌకలు, ఒక హెలికాప్టర్, సమీపంలోని టగ్‌బోట్ల సహాయంతో గల్లంతైన వారి కోసం గాలిస్తున్నారు. కాపాడిన వారిని సమీపంలోని తూర్పు జావా పోర్టుకు తరలిస్తున్నారు. మరోవైపు, బంజర్‌మాసిన్‌లోని త్రిశక్తి పోర్టు వద్ద గల్లంతైన వారి బంధువులు వందలాదిగా గుమిగూడారు. ప్రయాణికుల జాబితాలను చూస్తూ తమ వారి క్షేమ సమాచారం కోసం తీవ్ర ఆవేదనతో ఎదురుచూస్తున్నారు.

వేలాది ద్వీపాలతో కూడిన ఇండోనేషియాలో రవాణాకు ఫెర్రీలపైనే ఎక్కువగా ఆధారపడతారు. అయితే, భద్రతా లోపాల కారణంగా ఇక్కడ తరచూ ఇలాంటి సముద్ర ప్రమాదాలు జరగడం ఆందోళన కలిగిస్తోంది. అంతేకాకుండా, అధికారిక రికార్డుల్లో ఉన్న ప్రయాణికుల సంఖ్యకు, వాస్తవంగా నౌకలో ఉన్నవారి సంఖ్యకు తేడా ఉండటం ఇక్కడ సర్వసాధారణమని, దీంతో గల్లంతైన వారి కచ్చితమైన సంఖ్యను నిర్ధారించడం కష్టంగా మారిందని అధికారులు పేర్కొంటున్నారు.

# కార్మిక పక్షపాతి జగన్ : ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి

**గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి తర్వాత కార్మిక వర్గ దృక్పథంతో ముందుకు సాగిన ఏకైక ముఖ్యమంత్రిగా వైయస్ జగన్ గుర్తింపు పొందినట్లు శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి వెల్లడించారు. సమసమాజ స్థాపన దిశగా రాష్ట్రంలో శ్రమైక జీవన సౌందర్య సాధన కోసం ఆయన చిత్తశుద్ధితో కృషి చేసినట్లు కొనియాడారు. దవైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సింగు నరసింహారావు చౌదరి ఆదివారం బృందావన్ గార్డెన్స్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో ఆయనను సత్కరించి ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ, ప్రజా సంకల్ప పాదయాత్రలో పారిశుధ్య కార్మికుల కష్టాన్ని స్వయంగా చూసి చలించిపోయిన జగన్



తాను ముఖ్యమంత్రిగా పాలనా పగ్గాలు చేపట్టిన తొలి రోజుల్లోనే వారి వేతనాలు రెట్టింపు చేయడమే కాకుండా పని భద్రత కల్పించిన తీరే ఆయన కార్మిక పక్షపాతి అని చెప్పేందుకు ప్రత్యక్ష నిదర్శనమని గుర్తు చేశారు. ఆటో, టిప్పర్ డ్రైవర్లు, టైలర్లు తదితర అనేక రంగాల కార్మికులకు ప్రయోజనాలు కలిగించేలా ప్రత్యేక పథకాలు రూపొందించి ఆచరణలో అమలు చేసి చూపిన ఘనత వైయస్ జగన్ ఒక్కరికే దక్కుతుందని ఆయన ప్రకటించారు. నగదు బదిలీ పథకం ద్వారా మధ్య దళారీ వ్యవస్థ ప్రమేయం లేకుండా నేరుగా కార్మికుల బ్యాంక్ ఖాతాలోకే నగదు జమ చేసిన ఆదర్శ ముఖ్యమంత్రిగా అభివర్ణించారు.

కేవలం కార్మికుల ఖాతాల్లో నిధులు జమ చేసినంత మాత్రానే వారి జీవితాల్లో సమూల మార్పులు రావన్న వాస్తవం తెలుసు కనుకనే సీఎం జగన్ దీంతో పాటు వారి కుటుంబ సభ్యుల జీవన ప్రమాణాల పెంపు కోసం కూడా కృషి చేసే కార్యక్రమాలు చేపట్టినట్లు లేళ్ళ అప్పిరెడ్డి చెప్పారు. అందులో భాగంగా తొలుత వారి పిల్లలకు ఇంగ్లీషు మీడియంలో నాణ్యమైన విద్యను ఉచితంగా అందించడంతో పాటు పిల్లలను బడికి పంపే తల్లుల ఖాతాలో అమ్మ ఒడి పేరిట నిధులు వేసి వారి ఆర్థిక ఇబ్బందులు తొలగించినట్లు తెలిపారు. అంతే కాక సొంతిల్లు లేని కార్మిక సోదరులందరికీ వారి భార్యల పేరిట నివేశన స్థలాలతో పాటు ఇళ్ళు కూడా కట్టించి ఇచ్చినట్లు చెప్పారు. ఇలాంటి కార్యక్రమాలన్నీ కూడా కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపేవేనని ఆయన స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్ , మాజీ కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), మార్కెట్ బాబు, పడాల సుబ్బారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బత్తుల దేవానంద్, పార్టీ నేతలు మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పవన్, ఆలా కిరణ్, మంత్రి మహానంది, చింతపల్లి రమణ, రబ్బాని, ఆవుల సుందరరెడ్డి, రెడ్డి కోటేశ్వరరావు, నర్సిరెడ్డి, సుందరరావు, సురేష్, కౌండిన్య, చిన్న, సుబ్బరాజు, శంకర్, బాబు,

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్ కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# భారత్ అధ్యక్షతన బ్రిక్స్ సదస్సు విజయవంతం..

- పశ్చిమాసియాపై కీలక ఉమ్మడి ప్రకటన
- ఢిల్లీలో జరిగిన 18వ బ్రిక్స్ సదస్సులో కీలక ఉమ్మడి ప్రకటన వెల్లడి
- పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో సంయమనం పాటించాలని దేశాలకు పిలుపు
- ప్రధాని మోదీ దౌత్య చొరవతో భిన్నాభిప్రాయాల మధ్య కుదిరిన ఏకాభిప్రాయం
- బ్రిక్స్ కూటమికి 20 ఏళ్ల భవిష్యత్ విజన్ అవసరమన్న ప్రధాని మోదీ




**న్యూఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్):** భారత్ అధ్యక్షతన న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన 18వ బ్రిక్స్ సదస్సు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోంది. ముఖ్యంగా పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో సభ్య దేశాల మధ్య ఉన్న భిన్నాభిప్రాయాలను పక్కనపెట్టి, ఒక బలమైన ఉమ్మడి ప్రకటనపై ఏకాభిప్రాయం సాధించడంలో ప్రధాని నరేంద్ర మోదీ కీలక దౌత్య విజయం సాధించారు. భారత్ చొరవతో రెండు రోజుల పాటు జరిగిన ఈ సదస్సు విజయవంతంగా ముగిసింది.

సదస్సులో 10 పూర్తిస్థాయి సభ్య దేశాలతో పాటు సౌదీ అరేబియా కూడా పాల్గొంది. పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ బ్రిక్స్ దేశాలు ఏకగ్రీవంగా సంయుక్త తీర్మానాన్ని ఆమోదించాయి. ఈ తీర్మానంలో ఏ దేశం పేరునూ నేరుగా ప్రస్తావించనప్పటికీ, అన్ని పక్షాలు సంయమనం పాటించాలని, పరిస్థితిని మరింత దిగజార్చే చర్యలకు పాల్పడవద్దని పిలుపునిచ్చాయి.

పౌర మౌలిక సదుపాయాలు, అణు కేంద్రాలపై ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న దాడుల పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేసినట్లు 'జపాన్ టైమ్స్' తన కథనంలో హైలైట్ చేసింది. ప్రపంచ వాణిజ్యం, సరఫరా గొలుసులు, ఇంధన ప్రవాహానికి అంతరాయం కలగకుండా చూసేందుకు సమష్టి కృషి అవసరమని ఈ ప్రకటన నొక్కి చెప్పిందని 'అల్ జజీరా' పేర్కొంది.

సదస్సు ప్రారంభోపన్యాసంలో ప్రధాని మోదీ, బ్రిక్స్ కూటమికి రాబోయే 20 ఏళ్లకు సంబంధించి ఒక ప్రతిష్టాత్మక విజన్‌తో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తీసుకున్న నిర్ణయాల అమలుకు పటిష్టమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించినట్లు రష్యా ప్రభుత్వ వార్తా సంస్థ టాస్ నివేదించింది.

"గత రెండు దశాబ్దాల్లో బ్రిక్స్ ప్రపంచ వేదికపై తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును ఏర్పరచుకుంది. మనం పరస్పరం ఒకరి అభిప్రాయాలను ఒకరం గౌరవించుకుంటూ, ఏకాభిప్రాయంతో ముందుకు సాగుతున్నాం. ఎవరితోనూ ఘర్షణ ద్వారా కాకుండా, అందరినీ కలుపుకొని అభివృద్ధిని కోరుకుంటున్నాం" అని మోదీ అన్నారు.

మరోవైపు, బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్ కూడా ఈ సదస్సులో కీలక పాత్ర పోషించింది. వాణిజ్యం, పెట్టుబడులు, ఆర్థిక, సాంకేతికత, అభివృద్ధి సవాళ్లపై వ్యాపార ప్రముఖులు, మంత్రులు, దేశాధినేతలు తమ అభిప్రాయాలను పంచుకున్నట్లు యురేషియా రివ్యూ నివేదించింది.

బ్రిక్స్ దేశాల మధ్య అంతర్గత వాణిజ్యం, పెట్టుబడులు, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ), ప్రమాణాల సహకారం వంటి అంశాలపై ఈ ఫోరమ్ సిఫార్సులు సదస్సు ప్రకటనలలో ప్రతిబింబిస్తాయి.

ప్రముఖ అమెరికన్ వార్తాపత్రికలు సైతం ఈ సదస్సును మారుతున్న ప్రపంచ క్రమానికి ఒక సూచికగా అభివర్ణించాయి. అభివృద్ధి చెందుతున్న దేశాల తరఫున ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌లలో ఎవరి గొంతు బలంగా వినిపిస్తుందనేది ఈ సదస్సులో ప్రధానాంశమని 'న్యూయార్క్ టైమ్స్' పేర్కొంది.

అమెరికాతో భారత్, చైనాల సంబంధాలలో ఉన్న అనిశ్చితి, ఈ రెండు అణ్వస్త్ర పొరుగు దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించుకోవడానికి అవకాశం కల్పించిందని 'వాల్ స్ట్రీట్ జర్నల్' విశ్లేషించింది.

## వినాయక చవితి శుభాకాంక్షలు : ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి



**గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్):** వినాయక చవితి సందర్భంగా ప్రజలందరికీ శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

విఘ్నేశ్వరుడి అనుగ్రహంతో మంచి పనులకు విఘ్నాలు తొలగిపోయి, ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని, విజయాలు సిద్ధించాలని ఆకాంక్షించారు. గణనాథుని కరుణా కటాక్షాలతో రాష్ట్రంలోని ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో అభివృద్ధి చెందాలని ఆయన అభిలషించారు.

ప్రజలందరూ కులమతాలకు అతీతంగా.. పూర్తి శాంతియుత వాతావరణంలో.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా.. యావత్ సమాజ శుభాన్ని.. లోక కళ్యాణాన్ని కాంక్షిస్తూ.. వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి పిలుపునిచ్చారు.

ప్రజలందరికీ గణనాధుడు ఆశీస్సులు అందించాలని ఆకాంక్షిస్తూ బృందావన్ గార్డెన్స్‌లోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఉదయం వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్ ఒక ప్రకటలో వెల్లడించారు. ఈ వేడుకలకు అందరూ హాజరై విఘ్న నాయకుడికి జరిగే విశిష్ట పూజల్లో భాగస్వామ్యం కావాలని కోరారు.

## 16లోగా కొత్త పింఛన్లకు దరఖాస్తులు చేసుకోవాలి



**గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్):** కొత్త పింఛన్లకు ఈ నెల 16వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ పిలుపునిచ్చారు. దరఖాస్తు చేయుటకు గడువు ఇంకా రెండు రోజులు మాత్రమే ఉందని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో అర్హత కలిగిన పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర బలహీన వర్గాలకు కొత్తగా అవకాశం కల్పిస్తూ ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద తాజాగా దరఖాస్తు చేసుకొనుటకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని గుర్తుచేశారు. 16వ తేదీ వరకు స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కేంద్రాల్లో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందన్నారు. 17వ తేదీ నుండి 21వ తేదీ వరకు సంబంధిత శాఖల అధికారులు – జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఎక్సైజ్ అండ్ ప్రోహిబిషన్, మత్స్యశాఖ, సాంఘీక సంక్షేమ శాఖ, చేనేత – జౌళి శాఖ అధికారులు దరఖాస్తులను పరిశీలిస్తారని చెప్పారు. వృద్ధాప్య పింఛనుకు వయస్సు ధృవీకరణ (ఆధార్) పత్రం, వితంతు పింఛనుకు భర్త ఆధార్, మరణ ధృవీకరణ పత్రాలు, ఒంటరి మహిళా పింఛనుకు అవివాహిత కేటగిరిలో సంబంధిత తహశీల్దారు జారీ చేసిన ఒంటరి మహిళా (రాఱఅస్త్రశ్రీవ ఔశీఎవఅ) ధృవీకరణ పత్రం, వివాహిత కేటగిరిలో కోర్టు ఆదాలత్ ద్వారా జారీ చేసిన విడాకుల ధృవీకరణ పత్రం, దివ్యాంగుల పింఛనుకు 40 శాతం అంతకు మించి అంగవైకల్యము కలిగిన సదరం ధృవీకరణ పత్రంను దరఖాస్తుతో పాటు స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాలలో 16వ తేదీ లోగా సమర్పించాలని తెలిపారు. డప్పు కళాకారులు ప్రస్తుతం స్వయం ధృవీకరణ పత్రంను సమర్పిస్తే సరిపోతుందని చెప్పారు. అన్ని స్థాయిల్లో పరిశీలన పూర్తయిన అనంతరం అర్హులైన లబ్ధిదారులకు దశలవారీగా పింఛన్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అన్ని స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కేంద్రాల్లో కొత్త పింఛన్ దరఖాస్తు సేవ అందుబాటులో ఉందన్నారు.

## అగస్త్యేశ్వర స్వామి ఆలయానికి పల్లకి వితరణ



- చైర్మన్ సహకారంతో ప్రారంభించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్):** స్థానిక పాత గుంటూరులోని అగస్త్యేశ్వరస్వామి దేవస్థానానికి ఆలయ చైర్మన్ గాలి సతీష్ బాబు ఆధ్వర్యంలో పల్లకి వితరణ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే నసీర్ తొలుగ ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం పల్లకిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఎంతో ప్రాసత్యం కలిగిన అగస్త్యేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి చైర్మన్ గాలి సతీష్ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలందించాలని సూచించారు. కమిటీ సభ్యులు కలిసికట్టుగా ఆలయ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి, పరిరక్షణకు ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు తెలిపారు. ఆలయాల్లో దీప, దూప నైవేద్యాలతోపాటు అర్చకుల గౌరవ వేతనం పెంచినట్లు చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని ఆలయాల అభివృద్ధితోపాటు అవసరమైన చోట పునర్నిర్మాణానికి కృషి చేస్తున్నామని తెలిపారు.

## ఏపీ టెట్-2026 జూన్ ఫలితాలు విడుదల

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు శుభవార్త. ఏపీ టెట్–2026 జూన్ కు సంబంధించిన ఫలితాలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆదివారం విడుదల చేశారు. ఈ పరీక్షలో ఇన్–సర్వీస్ ఉపాధ్యాయులు 51 శాతం ఉత్తీర్ణత సాధించగా, సాధారణ అభ్యర్థులు 47 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ స్పందిస్తూ.. టెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులందరికీ, ముఖ్యంగా ఇన్–సర్వీస్ ఉపాధ్యాయులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. "ఇన్–సర్వీస్ ఉపాధ్యాయులు తమ అకడమిక్ నైపుణ్యాన్ని, నిబద్ధతను మరోసారి నిరూపించుకున్నారు. మీ కృషి, అంకితభావం ఆంధ్రప్రదేశ్ విద్యావ్యవస్థ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయి" అని ఆయన ప్రశంసించారు. అదే సమయంలో, ఈసారి అర్హత సాధించలేకపోయిన అభ్యర్థులు నిరాశ చెందవద్దని లోకేశ్ భరోసా ఇచ్చారు. "విజయం అనేది ఒక గమ్యం కాదు, అదొక ప్రయాణం. కాబట్టి పట్టుదలతో ప్రయత్నిస్తూనే ఉండండి" అని వారికి ధైర్యం చెప్పారు. లక్ష్యసాధన కోసం కృషి కొనసాగించాలని సూచించారు. టెట్ ఫలితాలను అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ aptet.apcfss.in ద్వారా తెలుసుకోవచ్చు.

## ఆర్యవైశ్యులు సామాజిక సేవకులు : ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి



**గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్):** ఆర్యవైశ్యులు సామాజిక సేవకులని శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా సేవా రంగంలో అందరికీ ఆదర్శపాత్రులని తెలిపారు.

నూతనంగా ఎన్నికైన గుంటూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నేరెళ్ళ వెంకట హరిప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి బాపారావు, కోశాధికారి వుడత మహేష్ కుమార్ ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని ఆయన శాలువాలతో సత్కరించి అభినందించారు.

అనంతరం ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ, ఆర్యవైశ్యులు తమ దైనందిన కార్యకలాపాలతో పాటు దాతృత్వ కార్యక్రమాలలో సైతం ఎప్పుడూ మిగిలిన వారి కంటే ఒకడుగు ముందే ఉంటారని తెలిపారు. ఓ పక్క వర్తక, వాణిజ్య రంగాలలో తలమునకలై ఉంటూనే మరో పక్క సొంత లాభం కొంత మానుకుని పొరుగువారి శ్రేయస్సు కోసం పాటుపడతారని కొనియాడారు. సమాజానికి అవసరమైన అన్ని సమయాలలో మేమున్నామని ముందుకొచ్చే ఆర్యవైశ్యుల పట్ల తనకు ప్రత్యేకమైన అభిమానమని ఆయన తెలిపారు. నూతనంగా ఎన్నికైన గుంటూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం నేతలు కూడా ఆ దిశగా ముందుకు సాగుతూ అందరి ఆదరాభిమానాలు చూరగొనాలన్న ఆకాంక్షను ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, ఆర్యవైశ్య సంఘం నేత కలిగలుపుల కాశీ విశ్వనాధబాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బత్తుల దేవానంద్, మాజీ కార్పొరేటర్ గురవయ్య, మంత్రి మహానంది తదితరులు పాల్గొన్నారు.

## కడియం నర్సరీల ప్రత్యేకతను గ్లోబల్ స్థాయిలో నిలబెట్టాలి : మంత్రి కందుల



**రాజమహేంద్రవరం (జర్నలిస్ట్ ఫైల్):** కడియం నర్సరీల ప్రత్యేకతను గ్లోబల్ స్థాయిలో నిలబెట్టాలని నూతనంగా ఏర్పాటైన అసోసియేషన్ కు మంత్రి కందుల దుర్గేష్ సూచించారు. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం కడియం గ్రామంలోని జీఎన్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన 'సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్' నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, స్థానిక ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పాలకవర్గ సభ్యులకు మంత్రి దుర్గేష్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకుముందు సర్ ఆర్థర్ కాటన్ దొర విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... ప్రజాస్వామ్యయుతంగా, సాధారణ ఎన్నికలను తలపించే రీతిలో జరిగిన ఈ ఎన్నికల్లో గెలుపొందిన అసోసియేషన్, నర్సరీ రైతాంగానికి మేలు చేకూర్చేలా పనిచేయాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా కడియం నర్సరీలు సాధించిన గుర్తింపును ప్రస్తావిస్తూ, ఈ ప్రత్యేకతను కాపాడుకునేలా నూతన పాలకవర్గం శ్రద్ధ వహించాలన్నారు. నర్సరీ రంగంలో 10 శాతం రైతులు మాత్రమే ఆర్థిక పరిపుష్టి సాధించారని, 90 శాతం మంది చిన్న, సన్నకారు రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రుణాల మంజూరులో ఉన్న ఇబ్బందులను తొలగించేందుకు రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరితో కలిసి త్వరలోనే బ్యాంకింగ్ ప్రతినిధులు, అసోయేషన్, నర్సరీ రైతులతో ముఖాముఖి సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆధునిక పూలసాగు పద్ధతులను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రతిపాదనలు పంపిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించి ప్రాంతీయంగా 'ఫ్లోరీ కల్చర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' ఏర్పాటుకు కృషిచేస్తామన్నారు. గతంలో నర్సరీలకు ఉచిత విద్యుత్ కొనసాగించడంలో, వాల్టా చట్టం విషయంలోనూ ప్రత్యేక చొరవ తీసుకున్నామని గుర్తుచేశారు. అటవీ ప్రాంతాలకు పర్యావరణ హితమైన మొక్కల సరఫరా అనుమతులపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి సానుకూల నిర్ణయాలు తీసుకున్నట్లు వెల్లడించారు. కడియం నర్సరీ రంగం తమకు సొంతింటి లాంటిదని పేర్కొంటూ, చిట్టచివరి రైతుకు సైతం సంక్షేమ ఫలాలు అందేలా అసోసియేషన్ స్పష్టమైన కార్యాచరణతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా నర్సరీ రైతుల సంక్షేమానికి, అభివృద్ధికి రూ. 5 లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రకటించిన మాజీ నర్సరీ అధ్యక్షులు రత్నం అయ్యప్పను మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేకంగా అభినందించారు.

నూతన అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన బొర్రు సుబ్బారాయుడుతో పాటు పాలకవర్గ సభ్యులు కామిశెట్టి వెంకటేష్, ఉండమట్ల అర్జున్, దూలం సత్యనారాయణమూర్తి, గట్టా కృష్ణ భగవాన్, సానా పల్లపురాజు, దేగల రాము, పుల్లా శ్రీను, బోడపాటి చంద్రశేఖర శ్రీనివాస్, పాటంశెట్టి శ్రీనివాస్, తాడాల సత్యనారాయణ, అన్నందేవుల వెంకటేశ్వరరావు మరియు ఇతర సభ్యులకు మంత్రి శుభాకాంక్షలు తెలుపుతూ అందరి మన్ననలు పొందేలా పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వారితో ప్రమాణ స్వీకారం చేయించారు.

## ఇంట్లో వినాయక ప్రతిష్ఠ పూజా నియమావళి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** వినాయక చవితి వచ్చిందంటే ఇళ్లలో సందడి మొదలవుతుంది. గణనాథుణ్ని ఇంటికి తీసుకొచ్చి భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించి పూజలు చేయడం అనేక కుటుంబాల్లో ఆనవాయితీ. ఈ ఏడాది గణేశ్ చతుర్థి సెప్టెంబర్ 14న(సోమవారం)జరుపుకోనున్నారు. చతుర్థి తిథి సెప్టెంబర్ 14 ఉదయం ప్రారంభమై సెప్టెంబర్ 15 ఉదయం వరకు కొనసాగనుంది.

గణేశ్ చతుర్థిని విఘ్నాలను తొలగించే గణనాథుడి ఆరాధనకు ప్రత్యేకమైన రోజుగా భావిస్తారు భక్తులు. ఇంటింటా వెనకయ్యను ప్రతిష్ఠించి కొందరు ఒకటిన్నర రోజు, మరికొందరు 3, 5, 7 లేదా 10 రోజుల పాటు పూజలు నిర్వహిస్తారు. అనంత చతుర్దశి రోజున నిమజ్జనంతో ఉత్సవానికి ముగింపు పలుకుతారు. అయితే ఇంట్లో గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించే సమయంలో కొన్ని విషయాలను తప్పనిసరిగా పాటించాలని సంప్రదాయాలు, వాస్తు విశ్వాసాలు చెబుతున్నాయి.

**గణపతి విగ్రహాన్ని ఏ దిశలో పెట్టాలి?**

గణపతి ప్రతిష్ఠకు దిశకు ప్రాధాన్యం ఉందని వాస్తు, ఆచార సంప్రదాయాల్లో చెబుతారు. సాధారణంగా ఇంట్లో గణపతి విగ్రహాన్ని ఈశాన్య దిశలో ఏర్పాటు చేయడం శుభప్రదంగా భావిస్తారు. పూజ చేసేటప్పుడు భక్తులు తూర్పు లేదా ఉత్తరం వైపు ముఖంగా ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలని సంప్రదాయాలు సూచిస్తాయి. అయితే ఇంటి నిర్మాణం, పూజాస్థలం, కుటుంబ ఆచారాలు ఒక్కో ఇంటికి భిన్నంగా ఉంటాయి. అందువల్ల దిశ విషయంలో స్థానిక ఆచారాన్ని లేదా పండితుల సూచనను అనుసరించడం మంచిది.

**ఎలాంటి గణపతి విగ్రహం మంచిది?**

ఇంట్లో పూజ కోసం సాధారణంగా కూర్చున్న గణపతి విగ్రహాన్ని శుభప్రదంగా భావిస్తారు. కూర్చున్న రూపం శాంతి, స్థిరత్వానికి ప్రతీకగా భావిస్తున్నట్టు ఆధ్యాత్మిక సంప్రదాయాలు చెబుతున్నాయి. విగ్రహం విరిగిపోకుండా, దెబ్బతినకుండా ఉండటమూ ముఖ్యమే. మూషికం, చేతిలో మోదకం, భక్తులను ఆశీర్వదించే హస్తం వంటి లక్షణాలతో ఉన్న విగ్రహాన్ని ఎంచుకోవడం ఆనవాయితీ.

**వినాయకుణ్ని కూర్చోబెట్టే విధానం**

సంప్రదాయం ప్రకారం.. గణపతి విగ్రహాన్ని నేలపై నేరుగా పెట్టకుండా ముందుగా ఒక చెక్క పీట లేదా ఎత్తైన పూజా వేదికను సిద్ధం చేసుకోవాలి. దానిపై శుభ్రమైన ఎరుపు లేదా పసుపు వస్త్రాన్ని పరిచి విగ్రహాన్ని ప్రతిష్ఠించాలి. అంతకంటే ముందుగా ఆ ప్రదేశాన్ని ముందుగానే శుభ్రం చేసుకుని పూజా సామగ్రిని సిద్ధం చేసుకోవాల్సి ఉంటుంది. గణేశుడిని ప్రతిష్ఠించిన తర్వాత నిమజ్జనం వరకూ.. ఆ ఇంటిని పూర్తిగా ఖాళీగా లేదా తాళం వేసి ఉంచకూడదనే నమ్మకం కొన్ని సంప్రదాయాల్లో ఉంది. ముఖ్యంగా నిత్యపూజ, దీపారాధన, నైవేద్యం కొనసాగించాలనే ఉద్దేశంతో కుటుంబ సభ్యుల్లో ఎవరైనా ఇంట్లో ఉండేలా చూసుకుంటారు. అయితే.. ఉద్యోగం, ప్రయాణం వంటి అనివార్య పరిస్థితులు ఉన్నవారు దీనిని కఠినమైన నియమంగా కాకుండా తమ కుటుంబ ఆచారం ప్రకారం నిర్వహించుకోవచ్చు.

**రోజుకు ఎన్నిసార్లు పూజ చేయాలి?**

గణపతి చతుర్థి సందర్భంగా ప్రతిష్ఠించిన విగ్రహానికి నిత్య పూజ, హారతి, నైవేద్యం చేయడం సంప్రదాయం. కొన్ని కుటుంబాల్లో రోజుకు మూడుసార్లు నైవేద్యం సమర్పించే పద్ధతీ ఉంటుంది. గణేశ్ చతుర్థి రోజున షోడశోపచార పూజ నిర్వహించే సంప్రదాయం కూడా ఉంది. ఇందులో సంకల్పం, ఆవాహన, ఆసనం, పాద్యం, అర్ఘ్యం, స్నానం, వస్త్రం, గంధం, పుష్పం, ధూపం, దీపం, నైవేద్యం తదితర ఉపచారాలు ఉంటాయి. సాధారణంగా తులసి దళాలను గణపతికి సమర్పించకూడదనే అనే సంప్రదాయం ఉంది. దీనికి పురాణాల్లోని తులసి–గణపతి కథను కారణంగా చెబుతారు. అదే సమయంలో కొన్ని గణేశ్ చతుర్థి ఆచారాల్లో తులసిని మినహాయింపుగా ఉపయోగించే సంప్రదాయ ప్రస్తావనలు కూడా ఉన్నాయి. కాబట్టి ఈ విషయంలో ప్రాంతీయ, కుటుంబ ఆచారాన్ని అనుసరించడం మంచిది.

గణపతి స్థాపనకు సంబంధించిన దిశ, విగ్రహం రూపం, తొండం, ఆహార నియమాలు వంటి అంశాల్లో ప్రాంతానికీ, కుటుంబ సంప్రదాయానికీ అనుగుణంగా తేడాలు ఉంటాయి. కాబట్టి వీటిని ఆధ్యాత్మిక విశ్వాసాలు, సంప్రదాయ ఆచారాలుగా చూడాలి. ఏదైనా ప్రత్యేక వ్రతం లేదా శాస్త్రోక్త పూజ నిర్వహించాలనుకుంటే కుటుంబ పురోహితుడు లేదా స్థానిక పండితుడి సూచన తీసుకోవడం ఉత్తమం.

## మట్టి విగ్రహాలనే పూజిద్దాం - పర్యావరణాన్ని, సాంప్రదాయాలను కాపాడుకుందాం

- ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వద్దు.. పవిత్రమైన మట్టి గణపతే ముద్దు:
- జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్
- గత మూడేళ్లుగా నిరంతరం మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్న అఖండ ఫౌండేషన్
- జిల్లా ప్రజలకు, అధికారులకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కలెక్టర్ అఖండ ఫౌండేషన్ అధ్యక్షులు విన్నకోట సురేష్
- మండపాల వద్ద డీజేలు, అపశబ్దాలకు దూరంగా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొల్పాలని జిల్లా కలెక్టర్ పిలుపు



**బాపట్ల జిల్లా (జర్నలిస్ట్ ఫైల్):** వినాయక చవితి వేడుకలను అత్యంత ఆనందోత్సాహాలతో పాటు పర్యావరణ హితంగా జరుపుకోవాలని, మన సనాతన సాంప్రదాయాలకు ప్రతి ఒక్కరూ పెద్దపీట వేయాలని బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. బాపట్ల ప్రసిద్ధ శ్రీ క్షీర భావనారాయణ స్వామి ఆలయం వద్ద ఆదివారం అఖండ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షులు విన్నకోట సురేష్ కలెక్టర్‌ను ఘనంగా సన్మానించగా, ఆయన తన చేతుల మీదుగా భక్తులకు మట్టి వినాయక ప్రతిమలను అందజేసి ఈ సత్కార్యాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా పూర్తిగా మట్టి విగ్రహాలను పూజించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పూర్వకాలం నుండి పసుపు, మట్టితో చేసిన గణనాథులను పూజించే ఆచారం మన సంస్కృతిలో భాగమని గుర్తుచేశారు. సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకుంటూ అత్యంత భక్తిశ్రద్ధలతో పండుగలను జరుపుకోవాలని సూచించారు. ప్రభుత్వం తరఫున వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ సదుపాయం అందించబడుతుందని, నిర్వాహకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే, డీజేలు అధిక శబ్దంతో కూడిన సౌండ్ సిస్టమ్‌ల వల్ల ప్రజలకు, ముఖ్యంగా వృద్ధులు, విద్యార్థులకు కలుగుతున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ.. పరిమిత శబ్దంతో బాక్సులు ఏర్పాటు చేసుకుని భక్తి పాటలు, భజన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. మండపాల వద్ద దేవుడి పాటలకు బదులు ఇతర అసభ్యకర పాటలు వేయడం సముచితం కాదని, ఆధ్యాత్మిక వాతావరణం దెబ్బతినకుండా యువత ప్రత్యేక శ్రద్ధ వహించాలని హితవు పలికారు. పోలీసు శాఖ జారీ చేసిన నియమావళికి పూర్తిగా సహకరించి, పండుగ వేడుకల్లో గానీ, నిమజ్జన కార్యక్రమంలో గానీ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కలెక్టర్ కోరారు. చివరగా జిల్లా ప్రజలకు, ప్రభుత్వ అధికారులకు ఆయన వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. అఖండ ఫౌండేషన్ అధ్యక్షులు విన్నకోట సురేష్ మాట్లాడుతూ, గత మూడు సంవత్సరాలుగా అఖండ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను నిరంతరం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వాడకం వల్ల పర్యావరణం, జల వనరులు కలుషితమవుతాయని, అందుకే ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలనే పూజించి ప్రకృతిని పరిరక్షించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో కలెక్టర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ.. అఖండ ఫౌండేషన్ సభ్యులు , బాపట్ల తాహశీల్దారు ఎస్.కె సలీమా, పట్టణ సీఐఆర్ రాంబాబు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467